




# వార్త

ఆదివారం

7 మే, 2023


# భవితపై ఆశతో..





ఈ మధ్య కాలంలో తెలుగు తెరపై గ్రామీణ నేపథ్యంలోని కథల సంఖ్య పెరుగుతోంది. మారుమూల గ్రామాల్లో, అడవికి సమీపంగా ఉండే గిరిజన గూడాల నేపథ్యంలో కథలు నడుస్తున్నాయి. దాంతో కథకి తగినట్టుగా కథానాయికలు డీ

# డీ గ్లామర్ పాత్రలో పాయల్ రాజ్‌పుత్!



గ్లామర్ రోల్స్ చేయవలసి వస్తోంది. హీరోయిన్స్ డీ గ్లామర్‌గా కనిపించిన సినిమాలన్నీ హిట్ అవడం విశేషం. సుకుమార్ దర్శకత్వం వహించిన 'రంగస్థలం' సినిమాలో సమంత డీ గ్లామర్ రోల్ చేసింది. పల్లెటూరి అమ్మాయి రామలక్ష్మిగా ప్రేక్షకులు ఆమెను ఒక రేంజ్‌లో రిసీవ్ చేసుకున్నారు. ఆ తరువాత సుకుమార్ దర్శకత్వంలో మరో సినిమా 'పుష్ప' వచ్చింది. అడవి నేపథ్యంలో నడిచే ఈ కథలో గిరిజన యువతి శ్రీవల్లిగా రష్మిక మంచి మార్కులు కొట్టేసింది. తాజాగా వచ్చిన 'దసరా' సినిమాలో వెన్నెల అనే డీ గ్లామర్ పాత్రలో కీర్తిసురేశ్ మెప్పించింది. ఇక ఇప్పుడు 'మంగళవారం' అనే సినిమాలో పాయల్ రాజ్‌పుత్ కూడా డీ గ్లామర్ రోల్ చేసినట్టు తెలుస్తోంది. సెంటిమెంట్ ప్రకారం ఈ సినిమా కూడా హిట్ కొడుతుందేమో చూడాలి మరి.

తారాతీరం

# ప్రభాస్, అనుష్క జంటగా?



'బాహుబలి 2' తరువాత నాయిక ప్రధానమైన కథలను మాత్రమే చేస్తూ వచ్చిన అనుష్క ప్రస్తుతం యూవీ బ్యానర్‌లో ఒక సినిమా చేస్తోంది. ఇప్పుడు అనుష్క-ప్రభాస్ జంటగా మరోసారి నటించే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. 'వీరమల్లు' సినిమాతో బిజీగా వున్న దర్శకుడు క్రిష్, ప్రభాస్ హీరోగా ఒక కథను సిద్ధం చేశారట. 'బాహుబలి' నిర్మాతలైన శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేనికి ఆ కథను వినిపించగా వారు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభాస్ నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈ చిత్రంలో కథానాయికగా అనుష్క పేరు తెరపైకి వచ్చింది. ఈ జంటకి ఉన్న క్రేజ్ కారణంగా ఈ కాంబినేషన్‌ను సెట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమా గురించి మిగతా వివరాలు త్వరలో అధికారికంగా వెలువడే అవకాశం ఉన్నట్లు తాజా సమాచారం.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
7 మే, 2023

## మంచి ముత్యాలు

మారణాయుధాలు మనల్ని నాశనం చేయకముందు మనం వాటిని నాశనం చేయడం మంచిది.

- జాన్ కెనడీ

## విషయ విశేషం

అద్దాల తోటలు... 4

'సంఘీ'భావం....5
వేసవి శిబిరాలతోనే విద్యార్థులకు మనోవికాసం

కవర్ స్టోరీ..6
భవితపై ఆశతో..

ఈవారం కవిత్వం..12
కొయ్యబొమ్మ

రోగుల పాలిట దేవతలు...14

కథ.. 20
ట్రస్ట్

అభ్యుదయం నుంచి విప్లవం వైపు....23

ముక్తిక్షేత్రం 'శ్రీ విష్ణు పాదగయ' ...25

చివరి కోరిక....30

ఇంకా..

పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## బ్యాగే ఛార్జింగ్ చేస్తే..!



విహారానికో, ఆఫీసు పనిమీదో ఎక్కడికైనా వెళ్లేటప్పుడు ముందుగా బ్యాగు తీసి అందులో మనకు కావాల్సినవన్నీ సర్దేస్తాం. కచ్చితంగా పెట్టుకునే వస్తువుల జాబితాలో పవర్‌బ్యాంకునీ ఉంచుతాం. ఎందుకంటే ప్రయాణాల్లో ఫోన్, ల్యాప్‌ట్యాప్‌నీ ఛార్జింగ్ చేసేస్తే..ఎంత సౌకర్యంగా ఉంటుందో కదూ. అయితే మామూలు వాటికి బదులు ఈ సోలార్‌బ్యాగ్‌లతో ఆ సౌలభ్యాన్ని చక్కగా పొందొచ్చు. బ్యాక్‌ప్యాక్ దగ్గర్నుంచి ల్యాపీబ్యాగుల వరకూ అన్ని రకాలు ఉన్నాయి ఇందులో. వీటిల్లో ఒక్కోదానికి ఒక్కో సైజులో సోలార్ ప్యానెల్స్, పవర్‌బ్యాంక్, ప్లగ్‌పిన్స్ జత చేసి ఉంటాయి. మనం బయటకు వెళ్లినప్పుడు సూర్యరశ్మి ద్వారా సౌరఫలకాలు శక్తిని గ్రహించి పవర్‌బ్యాంక్‌లో ఉంచుతాయి. మనం ఎక్కడున్నా.. అవసరమైనప్పుడు ఎంచక్కా బ్యాగుకే కావాల్సిన వాటిని ఛార్జింగ్ పెట్టుకోవచ్చు. ఈ బ్యాగుల్లో కొన్నింటికి ఎల్ఈడి లైట్లూ, వైర్‌లెస్ స్పీకర్లూ జత చేసి ఉంటాయి. అంటే బ్యాగే హాయిగా పాటలు కూడా వినిపిస్తుంది, చీకట్లో వెలుగులూ చిమ్ముతుంది.

### బ్యాటరీ అక్కర్లేని బొమ్మలు



పిల్లలు మామూలు బొమ్మల కన్నా ఏదో ఒక యాక్టివిటీ చేసేవాటినే ఎక్కువగా ఇష్టపడతారు. అయితే ఆ బొమ్మలు రకరకాల శబ్దం చేయాలన్నా, రయ్యిమని పరుగులు తీయాలన్నా, అటూ ఇటూ తిరుగుతూ ఆడాలన్నా, జిగేలుమనే కాంతులతో మెరిసిపోవాలన్నా వాటిల్లో బ్యాటరీలు కావాలి. కానీ వాటి అవసరం లేకుండానే ఆడే పాడే బొమ్మలూ ఉన్నాయి. అవే సోలార్ టాయ్స్, సోలార్ పవర్డ్ టాయ్ మినీ కార్, డ్యాన్సింగ్ టాయ్స్, సోలార్ ఎనర్జీ కాన్‌సెప్ట్ హౌస్.. ఇలా రకరకాల పేర్లతో ఆన్‌లైన్లో అందుబాటులో ఉన్నాయివి. చిన్నచిన్న సౌరవిద్యుత్ ఫలకాలతో ఉండే ఈ బొమ్మలు-పిల్లలు ఆడుకోవడానికీ, ఇంట్లో అందంగా అలంకరించుకోవడానికీ చక్కగా ఉపయోగపడతాయి. బ్యాటరీలతో పని లేకుండానే వెలుగుతూ, ఆడుతూ, పాడుతూ, తిరుగుతూ ఉంటాయి ఇవి.



# అద్దాల తోటలు

బెల్జియం రాజు రెండో లాపోల్డ్ 'బిల్డర్ కింగ్'గా ప్రసిద్ధి చెందాడు. **19**వ శతాబ్దానికి చెందిన ఈయన 'కాంగో' దేశస్థాపకుడు. ఆయన ప్రకృతి ప్రేమికుడు. లక్షల మొక్కల్ని కాంగో నుంచి బస్సల్స్‌కు తీసుకొచ్చి **11** అద్దాల మేడల్ని నిర్మించి, వాటిల్లో మొక్కల్ని పెంచాడు. నిరంతరం పర్యవేక్షణ కోసం **20** తోటబృందాలు ఉండేవట. రాజప్రాసాదానికి పక్కనే ఉన్న ఈ వనాలు 'రాయల్ గ్రీన్ హౌజెస్'గా పేరు తెచ్చుకున్నాయి. తరాలు మారినా ఈ అద్దాల తోటలు అలాగే నిలిచి ఉన్నాయి. వీటి ప్రాంగణాల్లో లెక్కలేనన్ని పూలమొక్కలు, పచ్చని చెట్లు కనువిందు చేస్తాయి.













## 'సంఘీ' భావం



# వేసవి శిబిరాలతోనే విద్యార్థులకు మనోవికాసం

వేసవి కాలం ప్రారంభమైంది. పాఠశాలలు సెలవులు ప్రకటించాయి. ఉన్నత విద్య మినహా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి నిత్యం పాఠ్యాంశాల బోధన, చదువు, హోంవర్క్, పరీక్షలు వంటి వాటిలో నిమగ్నమై బిజీగా గడిపిన విద్యార్థులకు వేసవి సెలవులు ఒక ఆటవిడుపు. ఇళ్లల్లో, సమీపంలోని మైదానాల్లో ఆడుకుంటూ కాలం గడిపేస్తున్నారు. మరికొందరు వారి స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళుతున్నారు. నిత్యం విద్యాపరమైన అంశాలతో గడిపిన విద్యార్థులకు ఎంతో కొంత ఉపశమనం ఉండాల్సిందే. అయితే వేసవి సెలవులు ఉండే సుమారు 40 రోజుల పాటు పూర్తిగా ఆటలకే సమయం కేటాయిస్తే తిరిగి పాఠశాలలు తెరిచే సమయంలో విద్యార్థులు పాఠశాల వాతావరణానికి అలవాటు పడటానికి ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇలాంటి సమస్యలు కలగకుండా చూడటంతో పాటు చిన్నతనం నుంచే ఇతర కార్యాక్రమాలు, వ్యాపకాలపై ఆసక్తి కల్పించేందుకు వేసవి సెలవులు ఎంతో ఉపయోగపడతాయి. ఇటీవల కొంతకాలం నుంచి పరిశీలిస్తే విద్యాసంస్థల్లో ఒక్క బోధన తప్ప ఇతర ఏ కార్యక్రమాలు ఉండటం లేదు. విద్యార్థుల్లో ఇతర విద్యలపై ఆసక్తి కలగడంతో పాటు నైపుణ్యత పెంచేందుకు వేసవి సెలవులు చక్కగా ఉపయోగపడతాయి. వేసవి సెలవులు ప్రకటించేందుకు ముందు కొన్ని సంస్థలు వేసవి శిబిరాలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశాయి. సంగీతం, గాత్రం, నాట్యం, కరాటే, జూడో, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, భాషా అభ్యాసం, గణితంలో నైపుణ్యం వంటి వాటిని నెల రోజుల పాటు ప్రత్యేకంగా నేర్పిస్తున్నారు. స్విమ్మింగ్ పూల్స్ అందుబాటులో ఉండే ప్రాంతాల్లో స్విమ్మింగ్ నేర్పిస్తున్నారు. ఏరులు, నదులు ఉన్న ప్రాంతాల్లో తర్ఫీదు పొందిన ఈతగాళ్లు పిల్లలకు అక్కడ ఈతలో నైపుణ్యాన్ని నేర్పిస్తున్నారు. పిల్లలు చలాకీగా ఉండాలంటే ఇలాంటి వాటిలో వారికి శిక్షణ పొందే అవకాశాన్ని కల్పించాలి. పిల్లలు కూడా ఇలాంటివి నేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తారు. స్పోర్ట్స్ అథారిటీ సంస్థలు వివిధ క్రీడల్లో వేసవిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నిస్, టేబుల్ టెన్నిస్ వంటివి ఇక్కడ అందుబాటులో ఉంచుతారు. హైస్కూళ్లలో చదివే విద్యార్థులు వెయిట్ లిఫ్టింగ్, వ్యాయామం వంటి వాటిలో తర్ఫీదు పొందే అవకాశం ఉంటుంది. వేసవి సెలవుల్లో ఎక్కువగా పిల్లలు నగరాలను వదిలి తమ తల్లిదండ్రుల స్వస్థలాలైన గ్రామాలకు తరలివెళతారు. అక్కడ కూడా సమ్మర్ కోచింగ్ సెంటర్లు పనిచేస్తుంటాయి. వేసవి సెలవులు అంతా ఇళ్లలోనే గడపకుండా ప్రత్యేక శిక్షణా శిబిరాలకు వెళ్లే అవకాశం కల్పించాలి. దీనివల్ల విద్యార్థుల్లో చురుకుదనం, వివిధ అంశాలపై విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. శారీరక అలసట వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పిల్లలను వేసవి విడిది ప్రాంతాలకు తీసుకువెళ్లడం వల్ల వారిలో అనేక అంశాలపై అవగాహన కలుగుతుంది. ప్రయాణాల్లో అనేక విషయాలు పిల్లలు గ్రహిస్తారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలి, తమ వస్తువులను ఎలా జాగ్రత్తగా ఉంచుకోవాలి అన్న విషయాలు తెలుస్తాయి. అదేవిధంగా కొత్త స్థలాలకు వెళ్లినప్పుడు తమ ప్రాంతానికి, ఆయా ప్రాంతాలకు ఉన్న తేడాలను గుర్తించి వాటిపై అవగాహన కల్పించుకుంటారు. వేసవిలో ఏదైనా దూర ప్రాంతానికి పిల్లలను తీసుకువెళ్లడానికి తల్లిదండ్రులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి, ఆయా ప్రాంతాలు పుణ్యక్షేత్రాలుగాని, పర్యాటక కేంద్రాలుగాని కావచ్చు. కొత్త స్థలాలకు వెళ్లడం వల్ల పిల్లల్లో ఏదైనా మానసిక, శారీరక లోపం ఉన్నా అవి చాలావరకు సద్దుబాటు అవుతుంటాయి. కేవలం విద్య మాత్రమే అభ్యసించి పట్టా పొంది బయటకు వస్తే ప్రస్తుతం ఉద్యోగాలు సంపాదించడం ఇబ్బందికరంగానే ఉంటోంది. ఇప్పుడు విద్యాసంస్థలు విద్యార్థులకు విద్య తప్ప మరో విషయంపై అవగాహన కల్పించడం లేదు. గతంలో డ్రిల్, మోరల్ క్లాసులు ఉండేవి. కొన్ని పాఠశాలల్లో క్రాఫ్ట్ తరగతులు కూడా ఉండేవి. ఇవి ప్రతి వారం ఉండేవి. క్రాఫ్ట్ తరగతుల్లో వడ్రంగి, నేత, కుమ్మరి పనులు నేర్పించేవారు. కొన్ని పాఠశాలల్లో మొక్కల పెంపకం, సాగు వంటి అంశాలపై అవగాహన కల్పించేవారు. గ్రంథాలయానికి తీసుకువెళ్లేవారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో సంవత్సరానికి ఒకసారి జులాజికల్ పార్క్, థీమ్ పార్క్, పురావస్తు ప్రదర్శన శాలలకు తీసుకువెళ్లేవారు. అయితే ప్రస్తుతం విద్య వాణిజ్యం కావడంతో ఇలాంటి వాటిని యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ఎక్కువ మార్కులు రావడానికి అవగాహన లేని బట్టీ పట్టించడం, వేలల్లో, లక్షల్లో ఫీజులు వసూలు చేయడం మినహా వేరే ఆలోచన ఉండటం లేదు. దీనితో విద్యార్థులు పరిసరాలపై అవగాహన లేక చిన్న విషయానికి తీవ్ర మానసిక వేదనకు గురికావడం, పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చినా, ఫెయిల్ అయితే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సమస్యల నుంచి పిల్లలను సురక్షితంగా కాపాడుకోవాలంటే విద్యతో పాటు ఇతరత్రా కార్యక్రమాలు, బోధనేతర విద్య పట్ల అవగాహన కల్పించడం ఒక్కటే మార్గం. ఈ విషయాన్ని మానసిక శాస్త్రవేత్తలు కూడా నిర్ధారిస్తున్నారు. వేసవి సెలవులను పూర్తిగా వినియోగించుకుని, పిల్లలకు అన్ని రంగాల్లో అవగాహన కల్పించేందుకు ఉపయోగించుకోవాల్సిన అవసరం తల్లిదండ్రులపైనే ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# భవితపై ఆశతో..

**మానవుల జీవనానికి ఆహారం అత్యవసరం. ఆహారం సమకూర్చుకోవడానికి, గౌరవప్రదంగా జీవించడానికి ఉపాధి, వృత్తి లేదా ఉద్యోగం కనీస అవసరం. ఆ ఉద్యోగం లేకుండా నిరుద్యోగం, పనిచేయడానికి శక్తి ఉండి పని కావాలనుకున్నప్పటికీ పని దొరక్కపోవడమే నిరుద్యోగం.**

కవర్ స్టోరీ

**తండ సదానందం**

ప్రపంచంలో అన్ని దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో నిరుద్యోగం ఒకటి. సాధారణంగా అభివృద్ధి చెందిన దేశాల్లో నిరుద్యోగం ఆర్థిక మాంద్యం వల్ల ఏర్పడుతుంది. ఇలాంటి నిరుద్యోగం తాత్కాలికమైనది. అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశాలలో నిరుద్యోగం అనేది వనరుల కొరత వల్ల ఏర్పడుతుంది. అందుకే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఏర్పడే నిరుద్యోగం శాశ్వతమైనది. భారతదేశంలో నిరుద్యోగాన్ని ప్రధానంగా గ్రామీణ నిరుద్యోగం, పట్టణ నిరుద్యోగమని రెండు రకాలుగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలో అధిక జనాభా వ్యవసాయంపై ఆధారపడటం వల్ల వ్యవసాయ రంగంలో అవసరానికి మించి పని చేస్తున్నారు. భారతదేశంలో ఇప్పటికీ 65 శాతం వ్యవసాయం వర్షాధారమైనది కావడం మూలంగా కూలీలు సంవత్సరానికి 7 లేదా 8 నెలలు మాత్రమే ఉపాధి పొందుతున్నారు. మిగిలిన కాలంలో వీరు నిరుద్యోగులే. పట్టణ ప్రాంతంలో అనేకమంది తమ సామర్థ్యం కంటే తక్కువ సామర్థ్యం కలిగిన ఉపాధి మాత్రమే పొందుతున్నారు. రాష్ట్రంలో, దేశంలో నిరుద్యోగ సమస్య విలయతాండవం చేస్తున్నది. కరోనా మహమ్మారి వల్ల గత మూడు సంవత్సరాలుగా ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై పలు పరిశ్రమలు మూతపడుతున్న సందర్భంగా కోట్లాదిమంది ప్రజలు ఉద్యోగాలు కోల్పోయి ఉపాధి లేక నిరుద్యోగులయ్యారు. భారతదేశంలో 23 కోట్ల మంది ఉపాధి లేక నిరుపేదలయ్యారు. ఉద్యోగాలు లేక యువతీ యువకులు నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. చేతివృత్తులన్నీ నిర్వీర్యం అయిపోయాయి. వేలాదిమంది తిండి లేక అలమటిస్తున్నారు. అర్థాకలితో జీవనాన్ని కొనసాగిస్తుండటం విచారకరం. ప్రపంచ ఆహార సూచికలో 107వ స్థానంలో ఉండటం బట్టి నిరుద్యోగం ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణం కావచ్చు. యువశక్తికి ఉద్యోగాలు, స్వయం ఉపాధి పథకాలు కల్పించి ఉపాధి కల్పించే మార్గాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ప్రభుత్వాలు ప్రజలకోసం ఆవిర్భవించాయని, ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించడానికి అవి కొనసాగుతాయని రాజనీతి శాస్త్ర పితామహుడు అరిస్టాటిల్ అభిప్రాయపడినట్లు.. గౌరవప్రదంగా జీవించడానికి కనీస అవసరాలు కల్పించవలసిన బాధ్యత పాలకులదే. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం 4,91,304 పోస్టులు కేటాయించబడితే అందులో 3,00,178 మంది పని చేస్తుండగా 1,91,126 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కనుక ఇంటికో ఉద్యోగం, ప్రతి ఏటా 25వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, అలా నాలుగు సంవత్సరాలలో లక్ష ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగంలోనే కోటి ఉద్యోగాలు ఇస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వ ఎన్నికల వాగ్దానాలు చేసి అధికారాన్ని చేపట్టిన తర్వాత వాటి విషయాన్ని మర్చిపోవడంతో నిరుద్యోగుల కలలు కల్లలుగానే మిగిలిపోయాయి. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చింది. యువతపై పంజా విసురుతుంది.

మార్చి 2023లో విడుదలైన సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ భారతదేశంలోని నిరుద్యోగానికి సంబంధించిన తాజా నివేదిక ప్రకారం దేశంలో నిరుద్యోగిత 7.45 శాతంగా లెక్కించబడింది. ఆంధ్రప్రదేశ్‌లో 6.6శాతం, తెలంగాణలో 5.5 శాతంగా నమోదు అయింది. దేశంలో నిరుద్యోగం హర్యానాలో అత్యధికంగా 26.8 శాతం, రాజస్థాన్‌లో 26.4 శాతం, జమ్మూ కాశ్మీర్‌లో 23.1 శాతం, సిక్కింలో 20.7 శాతంగా తర్వాత స్థానాల్లో ఉన్నాయి. కాగా ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరిలలో నిరుద్యోగిత రేటు తక్కువగా ఉంది. 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా 208 మిలియన్ మంది నిరుద్యోగులు ఉంటారని అంచనా. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగాన్ని తగ్గించడానికి 2030 వరకు భారతదేశంలో ప్రతి సంవత్సరం 10 మిలియన్ల ఉద్యోగాలను సృష్టించాలి. దేశంలో నిరుద్యోగుల మొత్తం సంఖ్య 36 మిలియన్లు. ఇది 15 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న జనాభాలో 40 శాతం. ఇదిలా ఉండగా తెలంగాణలో నిధులు, నీళ్లు, నియామకాలే నినాదంగా 1400 మంది విద్యార్థుల అమరవీరుల త్యాగాల పునాదిపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు, విద్యావంతులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించినప్పటి నుండి ఇప్పటివరకు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉద్యోగాల భర్తీ చేయకపోవడంతో కొలువుల కోసం ఎదురుచూసి, వయోపరిమితి దాటిపోతుండడంతో ఉద్యోగం రాదని ఆవేదనతో నిరుద్యోగులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. ఆరేళ్లుగా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నా ఏ ప్రయత్నం ఫలించడం లేదని నిరుద్యోగ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు నేనే ఆత్మహత్య చేసుకుంటున్నానని కాకతీయ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి సునీల్ నాయక్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సునీల్ ఘటన మరువక ముందే నాగార్జునసాగర్‌లో రవికుమార్ అతని భార్య అక్కమ్మ కూడా ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. దేశంలో, రాష్ట్రంలో ఇలాంటి హృదయ విదారక ఘటనలు



నిత్యం కోకొల్లలు. చదువుకు తగిన ఉద్యోగం లేక, కుటుంబ బాధ్యతలు నిర్వర్తించలేక ఎందరో నిరుద్యోగులు బలవన్మరణాలను కొనితెచ్చుకుంటున్నారు. ఉమ్మడి



ఆంధ్రప్రదేశ్‌లో న్యాయంగా దక్కాల్సిన ఉద్యోగాలు దక్కడం లేదని మా ఉద్యోగాలు మాకేనంటూ అందుకు ప్రత్యేక రాష్ట్ర సాధనతో ఉద్యోగాల భర్తీ జరుగుతుందని స్వరాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు మాకే లభిస్తాయని కండ్లు కాయలు కాచేలా ఎదురు చూసినా విద్యార్థుల ఆశలు ఆడియాశలు అయ్యాయి.

ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల హామీలు ఇచ్చిన కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల పాలకవర్గ నాయకుల మాటలు నీటి మూటలు అయ్యాయి. ఈ వాగ్దాన బంగారు బలిదానాలు కొత్తవేమీ కాకపోగా 75 సంవత్సరాల అమృతోత్సవాల తర్వాత కూడా నిరుద్యోగం ఓ పరిష్కారం లేని సమస్యగా మిగిలిపోవడం కాకతాళీయం కాదు. దశాబ్దాలుగా పాలకులు అవలంభిస్తున్న సామ్రాజ్యవాద విధానంలో భాగమే. నిరుద్యోగ రాక్షసిని పెంచి పోషించడం దాని లక్షణం.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిధులు నీళ్ల నియామకాల కోసమే మొదటి ప్రాధాన్యత అంశాల ఆకాంక్షతో జరిగింది. కానీ తెలంగాణ సిద్ధించి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఉద్యమకాలంలో ప్రచారం చేసినట్లు, భావించినట్లు, ఆశించినట్లు ఉద్యోగాలను భర్తీ చేసింది లేదు.

ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగం కోసమే ఎదురుచూస్తూ నిరాశా నిస్పృహల మధ్య యువతీ యువకులు విసిగి వేసారిపోయారు. సంవత్సరాల తరబడి ఉన్నత విద్యను అభ్యసించి పోటీ పరీక్షలలో నెగ్గేందుకు కోచింగ్‌ల పేరిట కోచింగ్ సెంటర్లకు లక్షలాది రూపాయలు చెల్లిస్తూ ఉద్యోగం సంపాదించాలనే పట్టుదలతో అహోరాత్రులు శక్తికి మించి కష్టపడుతున్నారు. పుస్తకాల ఖరీదు, కోచింగ్ ఖర్చు, ఉండటానికి హాస్టల్ వసతి, భోజనాల ఖర్చు వంటి వాటి కోసం ఇంటిదగ్గర తమకున్న కొద్దిపాటి ఆస్తిపాస్తులను తెగనమ్మి లేదా కుదువపెట్టి ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ ఉద్యోగం వస్తే జీవితం స్థిరపడుతుందని ప్రయత్నాలు కొనసాగిస్తూ ఉన్నారు.

కొందరైతే కుటుంబ సభ్యులను వదిలి, చిన్నపాటి ఉద్యోగాలు చేస్తూ తమ సామర్థ్యానికి తగ్గట్టు చదువుకు తగ్గట్టు ఉద్యోగం సాధించాలని ఒకవైపు ఉద్యోగం, మరోవైపు కుటుంబ బాధ్యతలు, ఇంకొక వైపు ఉద్యోగ సాధన కోసం పోటీపడు తున్నవారు ఎందరో ఉన్నారు.

ఇటువంటి తరుణంలో ఎన్నికలు సమీపిస్తున్న ఈ కాలంలో ఉద్యోగాల భర్తీపై రాష్ట్రముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటన చేశారు. అసెంబ్లీ సాక్షిగా గౌరవ ముఖ్యమంత్రివర్యులు చేసిన ఉద్యోగ నియామకాల ప్రకటన ఎన్నో ఇబ్బందు లను ఎదుర్కొంటున్న నిరుద్యోగులకు తీపి కబురయ్యింది. అందుకనుగుణంగా సంబంధిత నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేసి తొందరగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, ఉద్యోగ అభ్యర్థులు అన్ని నియామక పోటీపరీక్షలలో పోటీ పడేందుకు వీలుగా తగినంత వ్యవధిని ఇస్తూ నోటిఫికేషన్లను విడుదల చేయాలని, వయోపరిమితి ముగుస్తున్నవారికి ఊరట కలిగింది. అంతేకాక గరిష్ట వయోపరిమితిని పెంచుతున్నట్లు 95 శాతం స్థానికతతో రాష్ట్రపతి ఉత్తర్వులు సాధించామని ఫలితంగా అటెండర్ నుండి ఆర్డీవో వరకు 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కుతాయని కొలువుల జాతర జరుగుతుందని 80 వేల ఉద్యోగ నియామకాలు భర్తీ చేస్తామని ప్రకటన చేయడంతో ఉద్యోగ విద్యార్థి ఆశావహుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. ప్రకటించిన దాని ప్రకారం గ్రూప్ 1, 2,4 అసిస్టెంట్ ఎగ్జికూటివ్ ఇంజినీర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, డిఏవో లాంటి నోటిఫికేషన్లు టిఎస్పీఎస్సీ విడుదల చేసి దరఖాస్తులను స్వీకరించి, పరీక్షలు కూడా నిర్వహిం చడం జరిగింది. గ్రూప్ వన్ ప్రిలిమ్స్ ఫలితాలు కూడా విడుదల చేయడం జరిగింది. ప్రిలిమ్స్ క్వాలిఫై అయినవారు గ్రూప్ వన్ మెయిన్స్ కానివారు మిగతా పరీక్షలకు సీరియస్గా ప్రిపేర్ అవుతుం డగా మొదట టీఎస్పీఎస్సీ అధికారిక వెబ్ సైట్ హాక్ అయిందని తర్వాత గ్రూప్వన్ పేపర్ లీక్ అయిందని రెండు మూడు రోజుల తర్వాత టిఎస్పీఎస్పీ నిర్వహించిన అన్ని పరీక్షల పేపర్ల లీక్ అయ్యాయని, అన్ని పరీక్షలను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.



లీకేజీ పరంపరలో టీఎస్పీటిఎస్సీ ఉద్యోగుల హస్తం ఉందని ఈ విషయంపై విచారణ చేయాలని సిట్ దర్యాప్తు బృందాన్ని రంగంలోకి దింపింది రాష్ట్రప్రభుత్వం. దీంతో పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులలో అలజడి మొదలైంది. ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి చదువుతూ, పరీక్షలకు హాజరవు తున్న క్రమంలో లీకుల పర్వం అభ్యర్థులలో ఆందోళన కలిగిస్తుంది. కొంతమంది స్వార్థ ప్రయోజనాలకు టీఎస్పీఎస్సీని వనరుగా వాడుకోవడంతో 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడినట్లు అయింది. లీకేజీ వ్యవహారంతో కలతచెందిన ఒక యువకుడు ఆత్మహత్య కూడా చేసుకున్నాడు. లక్షలాది మంది జీవితాన్ని జీవిత లక్ష్యాలని చిదిమేస్తున్న లీకేజీఅంశం ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యోగ స్ఫూర్తికి మాయని మచ్చ లాంటిది.

ప్రభుత్వం నియమించిన బన్సాల్ కమిటీ నివేదిక ప్రకారం 1,91,000 ఉద్యోగాలు ఖాళీగా ఉంటే నాలుగు సంవత్సరాల కాలయాపనతో ప్రతి ఎన్నికల ముందు ఉద్యోగాల భర్తీ ప్రకటనల హడావుడి చేస్తూ నోటిఫికేషన్లను పొడిగిస్తూ ఇటీవల కేవలం 80,000 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ తెచ్చి సక్రమంగా పకడ్బందీగా నిర్వహించకపోవడంతో అవి కాస్త వివాదాల సుడిగుండంలో ఇరుక్కున్నాయి. వాటిని షెడ్యూల్ ప్రకారం భర్తీ చేసే మార్గాలు కూడా మూసుకుపోవడంతో నిరుద్యోగుల పాలిట శాపమైంది. గతంలో వేసిన ప్రతి నోటిఫికేషన్ వివాదాలమయం, కోర్టు కేసులపాలై తీవ్రజాప్యంతో బంగారు తెలంగాణలో నిరుద్యోగుల బతుకులు ఆగమయ్యాయి.

## నిరుద్యోగభృతి అమలు ఎక్కడ?

ఈ పరిస్థితులలో గతంలో హామీ ఇచ్చినట్లు నిరుద్యోగ భృతి కూడా అమలు చేయడం లేదు. చదువుకొని, ఏ ఉద్యోగం లేని యువతకు నిరుద్యోగభృతి ఇస్తామని గత ఎన్నికలలో వాగ్దానం చేసిన అధికార పార్టీ ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా, మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కూడా ఆ హామీ నెరవేరలేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టకుండా జాప్యం చేస్తూ నిరుద్యోగ భృతి ఊసేత్తకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమే కదా!

ప్రస్తుతం ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన పలు ప్రశ్నా పత్రాలు లీక్ కావడంతో ఉద్యోగ నియామకాల ప్రక్రియ ఆలస్యం అవుతోంది. కనుక గత 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని నిరుద్యోగులకు నెలకు రూ.3016/లు చొప్పున భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా నిరుద్యోగ భృతి అందజేయడానికి పరిశీలన చేస్తున్నట్లు మంత్రులు కూడా ప్రకటన ఇచ్చి ఉన్నారు. ఇది ప్రకటనల వరకే పరిమితమై ఆచరణకు నోచుకోలేదు. ఇటీవల గ్రూప్ 4 ఉద్యోగాల కోసం, ఇతర సాంకేతిక ఉద్యోగాలకు వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలనలోకి తీసుకుంటే రాష్ట్రంలో నిరుద్యోగ భృతికి అర్హత కలిగినవారు దాదాపు 12 లక్షల మంది వరకు ఉండవచ్చని అంచనా. 12 లక్షల మందికి పథకం అమలు చేసినా నెలకు 374 కోట్ల వరకు వ్యయం అవుతుంది. ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న జాప్యానికి నష్టపోకుండా నిరుద్యోగులకు నిరుద్యోగభృతి పథకం అమలుచేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

## నిరుద్యోగానికి కారణాలు

➡ అత్యల్ప అభివృద్ధిరేటు,
➡ జనాభా పెరుగుదల

➥ పురాతన వ్యవసాయ పద్ధతులు
➥ పరిశ్రమల్లో వస్తువులు తయారు చేయడానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం
➥ అల్ప వనరుల వినియోగం
➥ గ్రామీణ పారిశ్రామికీకరణ లోపం
➥ పట్టణీకరణ
➥ మౌలిక సదుపాయాల కొరత
➥ కుటీర పరిశ్రమల నిర్వీర్యం
➥ ఆర్థిక అసమానతలు
➥ అల్ప మూలధన కల్పన
➥ లోప భూయిష్టమైన సాంఘిక వ్యవస్థ శ్రమ సాంద్రత పద్ధతులు ఉపయోగించకపోవడం
➥ పారిశ్రామికీకరణ తక్కువ
➥ ఆర్థిక స్థోమత కేంద్రీకరణ
➥ అధికంగా వ్యవసాయ రంగంపై ఆధారపడటం
➥ లోప భూయిష్టమైన విద్యా విధానం

నూతన ఆర్థిక సరళీకరణ విధానాలతో నిరుద్యోగం తారాస్థాయికి చేరుతుంది. అంతేకాకుండా కొవిడ్-19 ప్రారంభంలో 2020 సంవత్సరం నుండి టెక్, ఐటి రంగాలలో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతున్నది. గతేడాది ద్వితీయార్థం నుండి పుంజుకొని ఈ ఏడాది ప్రారంభం నుండి తీసివేతలు తారాస్థాయికి చేరాయి. మూడు నెలల్లో 10000 పైగా టెకీలు ఇంటి ముఖం పట్టారు. ఈ ఏడాది గూగుల్ మెటా, మైక్రోసాఫ్ట్, ఏరిక్సన్, అమెజాన్, మైక్రాన్, డెల్ ఫిలిప్ వంటి ప్రముఖ సంస్థలు కూడా లే ఆఫ్ ప్రకటించాయి. కొత్త నియామకాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో లక్షలాది రూపాయలు సంపాదించినా ఉద్యోగ భద్రత లేనందున ఈ రంగానికి




చెందినవారు కూడా నిరుద్యోగులుగా వీధిన పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం తక్కువ స్థాయి ఉద్యోగాలైనా చేయడానికి సిద్ధపడుతున్నారు. ఏ చిన్న ఉద్యోగ ప్రకటన వచ్చినా వేలాదిగా బీటెక్ గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, కొన్నిసార్లు డాక్టరేట్ అభ్యర్థులు కూడా దరఖాస్తులు వేస్తున్నారు.

ఇటీవల కాలంలో న్యాయ విద్యలో డిగ్రీ సంపాదించిన ఒక వ్యక్తి డ్రైవర్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేయడం; ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదివిన ఒక యువతి జిహెచ్ఎంసిలో స్వీపర్ ఉద్యోగంలో చేరింది. కొన్ని రోజులకు అక్కడి అధికారులు ఆ విషయం తెలుసుకొని ఆమెను అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్‌గా నియమించడం కొసమెరుపు. ఈ సంఘటనలను బట్టి దేశవ్యాప్తంగా నిరుద్యోగం తారాస్థాయికి చేరిందని అవగతం అవుతుంది. నిరుద్యోగం ప్రభావం ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### పరిష్కార మార్గాలు..

➥ వ్యవసాయ పునర్వ్యవస్థీకరణ
➥ జనాభా నియంత్రణ
➥ శ్రమ సాంద్రత ఉత్పత్తి పద్ధతులను అవలంబించడం
➥ నైపుణ్యాలు పెంచే విద్యకు ప్రాధాన్యత వేగవంతమైన పారిశ్రామిక అభివృద్ధి
➥ పారిశ్రామిక వికేంద్రీకరణ, వేతన ఉపాధి పథకాల ద్వారా కమ్యూనిటీ ఆస్తుల కల్పన
➥ స్వయం ఉపాధి పథకాలను చేపట్టే విధంగా యువతను ప్రోత్సహించడం
➥ ఉపాధి హామీ పథకం లాంటి కొన్ని ప్రత్యక్ష చర్యల ద్వారా ఉపాధిని కల్పించడం.

### నిరుద్యోగ నిర్మూలన చేయకపోతే ఏమవుతుంది?

రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి పని చేసే హక్కును, గౌరవ ప్రదంగా జీవించే హక్కును కల్పించడానికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అన్వేషించాల్సిన అవసరం పాలకుల కనీస బాధ్యత. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. కానీ నేటి ప్రభుత్వాలు ఉద్యోగ ఉపాధి కల్పన బాధ్యతను గాలికి వదిలేసి కార్పొరేట్ సంపన్నుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తుండడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. సర్కారీ కొలువుల కోసం సర్వశక్తులు వొడ్డినా సంవత్సరాల తరబడి శ్రమపడినా ఫలితం దక్కకపోవడంతో ఓడిపోయిన అభ్యర్థులు, పరీక్షల అక్రమాలపై కలత చెందిన యువత వ్యవస్థపై కోపంతో అసాంఘిక కార్యకలాపాల వైపు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొనేందుకు దారి తప్పే అవకాశాలు మెండుగా ఉంటాయి.

ఇలాంటి అసంతృప్తి యువతను చేరదీసి స్వార్థపర శక్తులు తమ స్వార్థ ప్రయోజనాలకు, చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలలోకి నెట్టివేసే ఆస్కారం ఏర్పడుతుంది.





గడిచిన ఏడేళ్లలో 70కి పైగా లీకేజీలతో సుమారు కోటిన్నర మంది విద్యార్థులు నిరుద్యోగులు బాధితులయ్యారని అంచనా. ప్రభుత్వ ఉద్యోగాల ఎంపిక పరీక్షలు తదితరాలకు సంబంధించి రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాలలో తాజాగా తెలంగాణ రాష్ట్రంలో ప్రశ్నాపత్రాలు అంగడి సరుకులు అయ్యాయి. ప్రశ్నాపత్రాల చీకటి దందాలతో కొద్దిమంది కాసుల కక్కుర్తికి, యువత బలి పశువులుగా కావాల్సి రావడం అత్యంత విషాదకరం.

## జాబ్ క్యాలెండర్ జాడ ఎక్కడ?

సాధారణంగా విద్యార్థులకు వార్షిక పరీక్షలు మార్చి లేదా ఏప్రిల్ నెలలో ప్రతి ఏటా జరుగుతాయని తెలుసు. ఎంసెట్, పాలిటెక్నిక్, జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్, నీట్ వంటి ప్రవేశ పరీక్షలు ఫిబ్రవరి–మార్చ్ మాసాలలో నోటిఫికేషన్ ఇచ్చి మే నెలలో పరీక్షలు నిర్వహిస్తారు. సివిల్ సర్వీసెస్ నియామకాలకు యూపీఎస్సీ ప్రతి సంవత్సరం ఏడాది ముందే క్యాలెండర్‌ను ప్రకటించి దాని ప్రకారమే నోటిఫికేషన్ ఇచ్చి ఎనిమిది నుండి పది నెలలలోపే ప్రక్రియను పూర్తి చేసి నియామక పత్రాలను అందిస్తుంది. సివిల్స్ పరీక్ష జనరల్ అభ్యర్థులు 32 ఏళ్లలోపు ఆరు సార్లు, ఓబీసీలు 35 ఏళ్ల లోపు 9 సార్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 37 ఏళ్లలోపు ఎన్ని సార్లు అయినా రాయవచ్చు. ప్రతి సంవత్సరం అభ్యర్థులు తమ ప్రయత్నాలను కొనసాగిస్తారు. కానీ తెలంగాణ రాష్ట్రానికి చెందిన గ్రూప్ వన్ మాత్రం తమ వయోపరిమితిని ముగిసేలోపు అంటే జీవితంలో రెండు సార్లు రాస్తే చాలా ఎక్కువ. 2022 ఏప్రిల్‌లో రాష్ట్రం ఆవిర్భవించిన తొమ్మిది సంవత్సరాలకు తొలి గ్రూప్ వన్ నోటిఫికేషన్ విడుదలైంది. 3.86 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా అక్టోబర్ 2022లో జరిగిన ప్రిలిమ్స్‌కు 2.5 లక్షల మంది హాజరవగా, 25 వేలకు పైగా మెయిన్స్‌కు సెలక్ట్ అయి సన్నద్ధమవుతున్న దశలో లీకేజీ అభ్యర్థులను కుంగదీసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారిగా 2011లో నోటిఫికేషన్ వెలువడితే కోర్టు



వివాదాల కారణంగా రాష్ట్రాల విభజన అనంతరం వేరు వేరువేరుగా 2016లో మెయిన్ పరీక్షలు నిర్వహించారు. సరిగ్గా 11 సంవత్సరాల తర్వాత మరొక ప్రకటన వచ్చింది. గ్రూప్ టు 2016లో రాగా ఆరేండ్లకు మరొక ప్రకటన వచ్చింది. గత తొమ్మిది సంవత్సరాల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడానికి 2017 జులైలో టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ టిఆర్‌టి నోటిఫికేషన్ వచ్చింది. దాని ద్వారా నియామకం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మళ్లీ ఎప్పుడు టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ వస్తుందో తెలియదు. అలాంటి పరిస్థితులలో నిరుద్యోగులు భయాందోళనలతో ఏ ప్రకటన వస్తే అదే రాయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఉద్యోగం రాకుంటే తమ పరిస్థితి ఏమిటోనని మళ్లీ నోటిఫికేషన్లు ఇంకెన్నాళ్లకు వస్తాయో తెలియడం లేదని వాపోతున్నారు. 2022 మార్చి 9న రాష్ట్ర అసెంబ్లీలో గౌరవ ముఖ్యమంత్రి ప్రకటించినట్లు జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాలన్నీ జరిపితే బాగుంటుంది. ఆర్థికంగా నష్టపోయినా తిరిగి పొందవచ్చు, కానీ విలువైన కాలాన్ని వెనక్కి తెచ్చుకోలేమని, వయస్సు పెరిగేకొద్దీ పరీక్షల ప్రిపరేషన్ సన్నగిల్లుతుందని.. కనుక ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అమలు చేసి దాని ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చి నియామకాల ప్రక్రియను పూర్తి చేయాలని నిరుద్యోగులు, మేధావులు, బుద్ధిజీవులు కోరుతున్నారు.

## ముగింపు

ఒక దేశ ప్రగతికి అవరోధంగా నిలిచే ప్రధాన సమస్యల్లో నిరుద్యోగం ఒకటి. వర్తమాన భవిష్యత్తు జీవనాల్ని ప్రభావితం చేసే సమస్యల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలలో నిరుద్యోగ సమస్య ప్రధానమైంది. వస్తుసేవల ఉత్పత్తికి ఇతర వనరులతో పాటు మానవ వనరులు కూడా అవసరమవుతాయి.

నిరుద్యోగిత వున్నప్పుడు ఆర్థిక వ్యవస్థలో ఆర్థికపరమైన సమస్యలే కాకుండా సాంఘిక, రాజకీయ పరమైన సమస్యలు సైతం తలెత్తుతాయి. నిరుద్యోగులు కనీస అవసరాలను తీర్చుకోవడానికి నానా ఇబ్బందులు పడుతూ జీవనాన్ని కొనసాగిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రధాన సమస్యగా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలకు గుదిబండగా మారిన నిరుద్యోగ సమస్యను నిర్మూలించాల్సిన అవసరం ఉంటుంది. అందుకు తగ్గ ఉపాధి పథకాలు, ఉద్యోగ కల్పన పాలక వర్గాలు చేపట్టాలి. కానీ నయా ఉదారవాద విధానాల అమలుతో పాలక వర్గాలు నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ వంటి విధానాలతో ఉపాధి, ఉద్యోగ కల్పనకు తక్కువ ప్రాధాన్యం ఇచ్చి ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా కాలయాపన చేస్తూ దాటవేస్తుండటంతో నిరుద్యోగ సమస్య ప్రబలుతుంది. అలా కాకుండా జాబ్ క్యాలెండర్ అమలు చేసి, ప్రతి ఏటా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తూ స్వయం ఉపాధి అవకాశాల పథకాలను అన్వేషించి ఆ దిశగా యువతను ప్రోత్సహించినప్పుడే నిరుద్యోగులకు కాస్త ఊరట కలిగించినట్లు అవుతుంది. ఆ దిశగా పాలకుల ప్రయత్నాలు ఉంటాయని, చేస్తారని ఆశిద్దాం. ❑






# కళల సౌధం

**ప్రపంచ** ధనవంతుల్లో ఒకరైన ముఖేష్ అంబానీ గురించి తెలియని వారుండరు. ఆయన వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయల్లా వర్థిల్లుతున్నది. ముఖేష్ అంబానీ భార్య నీతాఅంబానీ 'కళల సౌధం అంటే 'కల్చరల్ సెంటర్' (ఎన్ఎంఏసీసీ) పేరుతో ముంబయిలో జియోవరల్డ్ సెంటర్‌లో అత్యంత సుందరంగా రూపుదిద్దుకున్న ఈ కళాత్మక వేదిక ఇటీవల ప్రారంభమైంది. ఇందులో ఏమేమీ ఉన్నాయో ఓసారి గమనిద్దాం..

**ఆర్ట్ హౌజ్:** భారతీయ కళలను కళ్లముందు నిలిపే ప్రదేశం ఇది. భారతదేశ విలువైన సంపద, పెయింటింగ్‌లను ప్రేక్షకులు ఇక్కడ చూసే అవకాశం దక్కుతుంది. టెక్ ప్రోగ్రామ్స్, వర్క్‌షాప్స్, ఎడ్యుకేషనల్ ఈవెంట్స్‌ను ఇక్కడ నిర్వహించుకోవచ్చు. కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో నాలుగు అంతస్తుల్లో దీన్ని నిర్మించారు. జాతీయ, అంతర్జాతీయ ఆర్టిస్టులు తమ వర్క్‌ను ఇక్కడ ప్రదర్శించవచ్చు.

**ది క్యూబ్:** కళారంగంలో ఎదగాలనుకుంటున్న ఆర్టిస్టులను ప్రమోట్ చేయడం కోసం నిర్మించిన ఎక్స్‌పెరిమెంటల్ థియేటర్ ఇది. కదిలే స్టేజ్ కలిగి ఉన్న ఈ క్యూబ్‌లో 125 మంది కూర్చోవచ్చు. లేజర్ ప్రొజెక్షన్ సిస్టమ్, అసిస్టెడ్ లిజనింగ్ సిస్టమ్, ఫుల్లీ ఇంటిగ్రేటెడ్ వీడియోరికార్డింగ్, ప్రొడక్షన్ సెటప్, 5జీ కనెక్టివిటీ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి. సినిమాల చిత్రీకరణ, లైవ్ ప్రదర్శనలు ఇక్కడ నిర్వహించుకోవచ్చు.



**స్టూడియో థియేటర్:** ఇప్పుడిప్పుడే కళల రంగంలో ఎదగాలని కోరుకుంటున్న ఆర్టిస్టుల కోసం ఈ థియేటర్‌ను నిర్మించారు. పేరు ప్రఖ్యాతులున్న కళాకారులు సైతం దీన్ని ఉపయోగించుకోవచ్చు. 250 మంది కూర్చునే సదుపాయం ఉన్న ఈ థియేటర్‌లో టెలిస్కోపిక్ సీటింగ్ సిస్టమ్, సౌండ్‌ప్రూఫింగ్ టెక్నాలజీ వంటివి ఉన్నాయి. చిన్నచిన్న ప్రోగ్రామ్స్‌ను నిర్వహించుకోవాలనేవారికి ఇది సరైన వేదికగా నిలవనుంది. ఈ థియేటర్‌లో ఉన్న మరో ఫీచర్ ఏమిటంటే టెన్షన్‌వైర్‌గ్రిడ్. మన దేశంలో ఈ రకమైన సదుపాయం ఉన్న మొదటి థియేటర్ ఇది. ప్రోగ్రామ్స్ చేసే సమయంలో లైటింగ్ నిర్వహణ దీనివల్ల మరింత సులభతరమవుతుంది.



**గ్రాండ్ థియేటర్**

ఇండియాలో అత్యుత్తమ ఆధునిక సాంకేతికతతో నిర్మించిన మొదటి థియేటర్ ఇందులో ఉంది. క్రియేటివ్ సీటింగ్ ఆరేంజ్‌మెంట్ ప్రత్యేక ఆకర్షణ. మూడు లెవెల్స్‌లో కూర్చునే విధంగా నిర్మించారు. 2 వేల మంది ఎలాంటి అడ్డంకి లేకుండా స్క్రీన్‌ను వీక్షించే సదుపాయం ఉంది. వీటికి అదనం 18 డైమండ్ బాక్స్‌లు ఉన్నాయి. డాల్బీ ఆటమ్స్ సరౌండ్ సౌండ్ సిస్టమ్‌తో కూడిన ప్రత్యేకమైన ప్రోగ్రామ్ వ్యవస్థ కలిగిన లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఇది ప్రేక్షకులకు మల్టీ డైమెన్షన్ అనుభూతిని అందిస్తుంది.



**ధీరూభాయి అంబానీ స్క్వేర్**

తామర పువ్వు ఆకారంలో నిర్మించిన ఫౌంటెన్ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. 45 అడుగుల ఎత్తు వరకు ఫౌంటెన్ నీళ్లు ఎగసిపడుతుంటే బ్యాక్ గ్రౌండ్‌లో వినిపించే సంగీతం, కనిపించే రంగులు సందర్శకులను కట్టిపడేస్తాయి. వాటర్, లైట్స్, సౌండ్ కలిసి మ్యాజికల్ డిస్‌ప్లేను కళ్లముందు ఉంచుతాయి. ●



# కొయ్యబొమ్మ



స్వేచ్ఛకు సంకెళ్లు వేసినట్టు కొయ్యబొమ్మ
భయంతో మౌనంగా తల దించుకునిలుచుంది
ఏ చెట్టు కొమ్మో.. కాండమో యేమో మరి?
పచ్చ పచ్చని రూపు అపురూపంగా
ఓటమిలో సైతం గెలుపందుకుంది
తన ఫలాల విత్తులతో యేనాడో ఎంతో దూరంగా
అంకురించి విస్తరించేలా
పయనించే ఉండి
ఉంటుంది!

తెగ తెగ్గొట్టినా చిగురిస్తూనే
పడగొట్టినా గెలిచేటి ధైర్యం చెట్టు స్వంతం!
ఆ షోరూమ్‌లో విద్యుత్ క్షణకాలం
అంతరాయంతో కొయ్యబొమ్మ చీకట్లో
కలిసి తిరిగి వెలిగిన దీప కిరణ సమూహంతో
అంతే సమ్మోహనంగా కనిపించింది
బతుకు భారమైన దారు శిల్పకారుడి
షోకేసులో సమ్మోహనమైన కొయ్యబొమ్మ
దైవం వెలిగించిన పట్టపగటి దీపం
ఆరని సూర్యుడు మనముందర అందరివాడు
గగన సరిహద్దులు తెలిసిన ఘనుడు
ప్రతి ఉదయం గెలుపు అందుకునేలా
వెలుగుతూ తల వంచనే వంచడు సూర్యుడు
నేనూ అంతే! తల వంచనే వంచను కాక వంచను
కొయ్యబొమ్మ మాత్రం భయంగా మౌనంగా
నిలుచుని తల దించుకునే ఉంది!

**- ఎల్. రాజాగణేష్**

---

# జ్ఞాపకాల తోటలో..

ఇప్పుడిప్పుడే తెలుస్తుంది/ మనసు మాయమవడం.
గాలం ఎలా వేసావో
తెలిసాక.. / నిశ్శబ్ద నిట్టూర్పులు /
సాక్ష్యాలు లేని సంగమానికి
జ్ఞాపకాలే



ఈవారం కవిత్వం

ఆనవాలు/ చిగురులు తొడిగే ఆశలకు
ప్రేమ ఒక్కటే శాసనం/ జ్ఞాపకాల తోటలో.. వాడని పువ్వులు
అంటదు శిశిరం../ పరిష్వంగపు ప్రసాదంలో
తీయని నీ గమకాల రుచులు నన్ను బతికిస్తున్నయ్.

**- 'ధరణికోట' శివప్రసాద్**

---

# అమ్మ




అమ్మ నాతోనే
బైటికి వెళ్తే
బండి మీద అల్లనేరేడి పళ్లు కనపడ్తే
కొనుక్కొనేది
ఇంట్లో ఇచ్చేది.
పేగుబంధం తెగిపోయింది
అనురాగ సుమగంధం
ఇగిరిపోయింది
ప్రకృతిలో అక్షరాకృతిలో
ఒరిగిపోయింది
కాలం ఉరుముల్లేని పిడుగుల్ని
రాల్చింది
అప్పుడే
మూడు అడుగుల్ని దాల్చింది
నేనిప్పుడు
రోజూ ఆ బండివాడు
రోడ్లో కనపడతాడని అన్వేషణలో
అమ్మ
పంచభూతాల్లో కలవడం అబద్ధం
ఆలస్యమెలా అంటూ
నా దేహం నిండా మధుమేహమై
అమ్మ నాలోనే
దారి చూపిస్తూ దోవ నడిపిస్తూ
అమ్మ నాతోనే.

**- కోటం చంద్రశేఖర్**

# పుస్తక సమీక్ష

## 'అక్షర చిరుకవితా చంద్రికలు'



డా॥ తరపట్ల సత్యనారాయణకు అంకితంగా 103 కవితలతో ఈ చిరుకవితా చంద్రికల సంపుటిని వెలువరించారు కవి. వడాలి రాధాకృష్ణ, డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, డా॥ జి.వి.పూర్ణచందు, ఆచార్య పి.వరప్రసాదమూర్తి, డా॥ తరపట్ల సత్యనారాయణ లాంటి సాహితీవేత్తలు చక్కటి విలువైన ముందు మాటలు రాసారు. వీరి కవిత్వంలో స్త్రీ పురుష సంబంధాలు వైరుధ్యాలు, అవినీతి, మానవీయ విలువలు నేటి యువత నీతి, రీతి, మధ్య తరగతి జీవితాలు కవిత్వీకరించిన కవి రాసిన చిరుకవితా చంద్రికల్లో కొన్నింటిని మచ్చుకు చూద్దాం. ఆలుమగల బంధాన్ని ఓ కవితలో కవి ఇలా అంటారు. 'జోడెద్దులు సమముగానె/ కూడినడిస్తేనే వ్యవసాయం/ ఆలుమగలు కలిసిమెలిసి సాగితేనే సంసారం (పేజీ.29) అలాగే దేశాన్ని కాపాడిన సైనికుల గురించి ఓ చోట కవి ఇలా రాసారు. 'దేశ రక్షణకై తమ భార్యా బిడ్డల్ని విడిచిపెట్టి/ తమ ప్రాణాన్ని ఫణంగా పెట్టి/ దేశ సరిహద్దుల్లో గస్తీకాస్తూ/ తమ జీవితాన్ని త్యాగం చేస్తారు సైనికులు. ఇది మహోన్నతమైన విషయం' అంటారు (పే.38). ఈరోజు ఎల్.కె.జి పిల్లాడు నుండి వయోవృద్ధులదాకా స్మార్టుఫోన్లకు బానిసలుగా మారే స్థితిని మనం చూస్తూనే వున్నాం. దీనిపై ఓ కవితలో (పేజీ.60) కవి ఇలా రాసారు. కొంతమంది యువతీ యువకులు స్మార్టుఫోన్లకు బానిసలు, వాటి పిచ్చిలో పడి భవిష్యత్తును నాశనం చేసుకునే మూర్ఖులు అంటారు. **(చిరు కవితా చంద్రికలు, రచన: వల్లభుని నిర్మలప్రసాద్, వెల: రూ. 100, ప్రతులకు: ఇ.నం. 82-7-6/7, రాజమహేంద్రవరం)**

**- తంగిరాల చక్రవర్తి**


## 'కర్కటి' అనే విషూచిక వ్యాధే..'కరోనా'



'ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరు' అన్నాడు ఓ మహాకవి. ఊహకి అందనిదే కాలం. దానినే 'కాలమహిమ' అనవచ్చు. గత మూడు సంవత్సరాలుగా 'కరోనా' మహమ్మారి సృష్టించిన విధ్వంసం, మానవాళిపై విజృంభించిన వైనానికి యావత్ ప్రపంచం ప్రత్యక్షసాక్షి. 'సూక్ష్మ శరీరంతో మాయారూపం ధరించి ప్రజల నాసికారంధ్రాల నుంచి ప్రవేశించి, ఊపిరితిత్తులను ఆక్రమించి, శరీర అవయవాలను పీడించి క్రమంగా వారిని కబళించు' అనే సత్యాన్ని వాల్మీకి మహర్షి తాను రచించిన వాశిష్ట రామాయణాంతర్గతమైన ఉత్పత్తి ప్రకరణ"నందు స్పష్టం చేశారని భాగవతుల లక్ష్మీనరసింహం తన ద్విశతి పద్యకావ్యంలో తెలియజేస్తున్నారు. ఈ ప్రకరణ కర్కటి (కరోనా) అనే పేరుగల విషూచిక వ్యాధిగ వివరించబడిందని 'కాలమహిమ', పద్యములోని చందోబద్ధ పద్యాల్లో నిక్షిప్తం చేసి మన ముందుంచారు. 2019 సం॥ నుండి కాలంలో వచ్చిన పెనుమార్పుల వల్ల ఆరోగ్యవంతులు కూడా అస్వస్థులవ్వడం కాలమహిమ కాక మరేమిటి అని నిలదీస్తున్నారు కవి. 'కాలాధీవంతు దైవమ్' అంటే కాలమునకు అధీనుడు భగవంతుడే.మంచి, చెడు ఏది జరిగినా 'కాలమహిమే' అని సాధికారికంగా నిరూపించే ప్రయత్నమే ఈ కావ్యరచన. **(కాలమహిమ, రచన: లక్ష్మీనరసింహం, వెల: రూ. 120, ప్రతులకు: భాగవతుల పద్మావతి, 14-2-17/4, నరసాపురం)**

**- రమణ వెలమకన్ని**


## లోకంతీరు ప్రతిఫలించిన కథలు



'కారణం ఇది' అంటూ నిర్ధారించి చెప్పలేం. కానీ తెలంగాణ వచ్చాక ఈ 8 ఏళ్లలో తెలంగాణలో 'సాహిత్య సోయి' పెరిగినట్లు కనబడుతోంది. కథలు, నవలలు, వ్యాసాలు, కవిత్వం, నిన్నగాక మొన్న ఆస్కార్ గెలుచుకున్న 'నాటు-నాటు' పాట తెలంగాణ సాహిత్య వైభవం గ్రహణం విడిచిన చంద్రుడిలా శోభాయమానంగా ప్రకాశిస్తున్నది. మనసులో చొరబడిందంటే చాలు.. రాసేవరకు నిలవనీయని ఈ సంపుటి రచయిత్రికి ఇది రెండవది. ఇందులో 15 కథలున్నాయి. నేటి సమాజానికి అవసరమయ్యే కథలు అవును. మైసమ్మబండలోని సరోజే కావొచ్చు, కాళికలోని రంగత్త కావొచ్చు.. వీళ్లందరూ తమ కష్టాల్లోంచి బయటపడే ఆశావహ దృక్పథంతో కథ నడిపించారు రచయిత్రి. జీవితం అందునా కింది తరగతి వాళ్లవి పూల పాన్పులు కావని, ముళ్లనూ వారే ఏరేసుకోవాలి అన్న ప్రేరణాత్మక సందేశం బావుంది. సంపుటికిచ్చిన శీర్షిక కథలోనూ, అందరూ వ్యవసాయం వ్యర్థం అనుకుంటున్న సందర్భాన, వ్యర్థం కాదు, అదే పరమార్థం అని నిరూపించారు. ఆడపిల్ల అయినా, వారి బ్రతుకుల్లోకి జొరపడుతోన్న దౌర్జన్యం, ప్రతిఘటించలేనితనం నిరాశా, నైరాశ్యత, ఈ రెంటింటి మధ్య సామ్యత చదివిన పాఠకుడి మనసు కాసేపు శూన్యంలోకి ప్రవహిస్తుంది. ఇంతకంటే మంచి ముగింపు ఉంటే బావుండుననిపిస్తుంది. **(మైదాకు వసంతం, రచయిత్రి: కోట్ల వనజాత, వెల: రూ 125, ప్రతులకు: తెలంగాణ సారస్వత పరిషత్)**

**- కూర చిదంబరం**

## చెళ్లపిళ్ల వారి 150 జ్ఞాపకాలు



ఇప్పటి తరం తెలుసుకోవలసిన చెళ్లపిళ్ల వారి 150 జ్ఞాపకాల సంకలనం, పాఠకులకు ఆణిముత్యాలవంటి ఆసక్తికరమైన అనుభవాలను అందచేస్తోంది. సేకరణకర్త, రచయిత సుదర్శనం వర్తమాన తరం, భద్రపరచుకోదగిన చరిత్రాత్మక అంశాలు, సంబంధిత ఘట్టాలు, సాహిత్య సామాజిక అంశాలను, పుస్తకంగా పదిలపరచడంలో కృతకృత్యులయ్యారు. దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి జంటకవులుగా, జంట అవధానులుగా లబ్ద ప్రతిష్టులు. చెళ్లపిళ్లవారి 152 జయంతి సందర్భంగా వారి 150 జ్ఞాపకాలను తమ ప్రజాపత్రికలో సీరియల్‌గా ప్రచురింపచేసిన సుదర్శనం, వాటిని గ్రంథస్తం చేయడం అభినందనీయం. ఒకనాటి సాహిత్య చరిత్రకు అవధాన జీవనగాథల విశేషాంశాలు నేటి తరానికి వివరించడం, నాటి సమాజ స్థితిగతులు, వారి జీవితాల అద్భుతాలు కాలగతిలో చెరిగి కనుమరుగు కాకుండా సామాజిక బాధ్యతగా గ్రంథస్థం చేయడంలో సుదర్శనం ధన్యత పొందారు. వెలుగు చూడని 150 అంశాలు ఇందులో క్లుప్తీకరించారు. కవిత్వ ప్రతిభా ఇంద్రజాలికులుగా, తెలుగు సాహితీ చరిత్రలో పద్యకవితా ప్రస్థానంతో సుస్థిర కీర్తి సాధించిన చెళ్లపిళ్లవారి దివ్యస్మృతికి సుదర్శనం సమర్పించిన స్మృత్యంజలి గ్రంథంయిది. **(శ్రీ చెళ్లపిళ్ల వారి 150 జ్ఞాపకాలు, సంకలనం: సుదర్శన్, వెల: రూ 100, ప్రతులకు: ప్రజాపత్రిక, జాతీయ తెలుగు వారపత్రిక, రాజమండ్రి)**

**- యర్రమిల్లి**





# రోగుల పాలిట దేవతలు

రోగులకు అమూల్యమైన సేవలందించినవారిలో ముందుగా మనకు సావిత్రిబాయి పూలే, మదర్‌థెరిస్సా గుర్తుకు వస్తారు. వారి స్థాయిలోనే యుద్ధంలో గాయపడిన సైనికులకు అద్భుతమైన సేవలు అందించిన మరో మహిళ ఉన్నారు. ఆమే ఫ్లోరెన్స్ నైటింగేల్. ఆమె సేవలను గుర్తించి 'ఇంటర్నేషనల్ కౌన్సెల్ ఆఫ్ నర్సెస్' సంస్థ 1965 నుంచి నైటింగేల్ పుట్టిన రోజైన మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా ప్రకటించారు. 2023లో 'మన నర్సులు మన భవిష్యత్తు' అనే ఇతివృత్తంతో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకోనున్నారు. వైద్యులు రోగులను నిర్ధారిస్తారు. మందులు సూచిస్తారు, శస్త్రచికిత్సలు చేస్తారు, కానీ నర్సులు లేకుండా వారి పాత్రలు అసాధ్యం. నర్సులు ప్రతిరోజూ ముందు వరుసలో ఉంటారు. రోగులతో సంభాషిస్తారు, ప్రాణాలను కాపాడుతున్నారు. శస్త్రచికిత్సకు ముందు, అనంతరం చికిత్సను అందించడం, ఔషధం మోతాదు, ఇంట్రావీనస్ కషాయాలను పర్యవేక్షించడం, రోగి నమూనాలను తీసుకోవడం, ఉష్ణోగ్రతలు, రక్తపోటులను చెక్ చేయడం వంటి వెనుక ఉన్న ప్రాథమిక శక్తి. అంతేకాదు, రోగుల గాయాలకు చికిత్స చేస్తారు. అనేక సందర్భాల్లో, తీవ్రమైన అనారోగ్య రోగులకు గడియారం చుట్టూ శ్రద్ధ వహిస్తారు. లేడి విత్ ది లాంప్‌గా పేరుగాంచిన నైటింగేల్ చేసిన సేవల వలన మరణించే రోగుల సంఖ్య బాగా తగ్గింది. యుద్ధంలో దెబ్బతిన్న ప్రతి సైనికుడికి తాను బతుకుతాను అన్న ఆశ చిగురింపచేసేది. ఎంతో గొప్పింటి అమ్మాయి అయినప్పటికీ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ చేయడానికే నిశ్చయించుకుంది. ఎన్నో కష్టాలు ఎదురైనా చిరునవ్వుతో ఎదుర్కొన్నది. ఆ రోజుల్లోనే ఒక విధంగా సంఘం మీద తిరగబడింది. స్త్రీలు ఇంటి పట్టునే ఉండాలన్న కట్టుబాట్లను ఛేదించింది. అవివాహితులు ఇంటి పనులు, చర్చి పనులు చేయాలని ఆ రోజుల్లో చెప్పేవారు. తన తండ్రి విలియం ఎడ్వర్డ్ ఎంతో ధనికుడు. తన కుమార్తెలకు గణితం, భూగోళం, వ్యాకరణం, చరిత్రతో పాటు గ్రీకు, లాటిన్ భాషలు బోధించేవాడు. అయినా పేదలకు, అనాథలకు సేవ చేయాలన్న అభిలాష ఫ్లోరెన్స్‌కు పుట్టుకతోటే వచ్చి వయసుతో పాటు పెరిగింది.

1812 మే 12న ఫ్లారెన్స్ ఇటలీలో జన్మించారు. ఫ్లోరెన్స్ కన్నా పెద్ద ఒక అక్క ఉండేది. తండ్రితో పాటు అక్కాచెల్లెళ్ల ఇద్దరు వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఆనాటి సమాజంలో ఉన్న వివిధ సమస్యలను అవగతం చేసుకునేవారు. ఆ రోజుల్లో ఆస్పత్రులు అధ్వాన్న స్థితిలో ఉండేవి. శుచి, శుభ్రత, ఏమాత్రం ఉండేవి కావు. అయినా ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగు పని చేయడానికే నిర్ణయించుకుంది. తన తల్లి సాహితీ ప్రపంచంలో ధ్రువతారగా వెలగాలని కోరినా, ఫ్లోరెన్స్ నైటింగేల్, జర్మనీలో కైసర్ సంస్థను గురించి విని, అక్కడే పని చేయాలని నిర్ణయించుకుంది. ఇద్దరు బిడ్డల్ని దత్తత తీసుకుని పెంచడం మొదలు పెట్టింది. 1852లో ఐర్లాండ్ వెళ్లింది. అక్కడి ఆసుపత్రులను చూడగానే వాటిల్లో విప్లవాత్మకమైన



మార్పులను తీసుకురావలనుకున్నది.
1853లో సిస్టర్స్ ఆఫ్ చారిటికి వెళ్లింది. తిరిగి లండన్ వచ్చి, తన నాయనమ్మకు సేవ చేయడానికి రాగా అక్కడ కలరా వ్యాపించింది. వెంటనే ఆసుపత్రులకు వెళ్లి రోగులకు, పగలు, రాత్రి అనక సేవలందించింది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి రోగులకు మంచి ఆహారం అందించింది. 1854-56లో క్రిమియాలో ఘోరయుద్ధం జరిగింది. ఫ్లోరెన్స్ తోటి నర్సులను కూడగట్టుకుని గాయపడిన సైనికులకు చికిత్స అందించేది. మొదట్లో ఆమెను చూసి అధికారులు మండిపడేవారు. తరువాత ఆమె నిరుపమాన సేవకు ముగ్ధులయ్యారు. వారికి రోజూ కావాల్సిన మందులు, పరికరాలను పంపమని అభ్యర్థనలు పంపి తెప్పించేది. చాలాసార్లు తన స్వంత డబ్బు ఖర్చు పెట్టి అన్నీ తెప్పించేది. ఆసుపత్రులలో చోటు సరిపోకపోతే, అధికారులను ఒప్పించి పాత ఇళ్లను, భవంతులను ఆసుపత్రులుగా మార్చేది. రాత్రులలో రెండు, మూడు గంటలే పడుకుని అహర్నిశలు పని చేసేసరికి ఆమె చిక్కిపోయింది. అయినా రోగులకు ఆమె ఆరాధ్య దైవం. ఆమె నడచిన దారి అతిపవిత్రం. వారు 'విక్టోరియా రాణి మరణిస్తే ఫ్లోరెన్స్‌ను రాణి చేస్తామని' అనేవారట. ఆమె ఎక్కడికి వెళ్లినా సైనికులు అడవి పూలతో పుష్పగుచ్ఛాలనిచ్చేవారట. అది చూసి తోటి డాక్టర్లు, నర్సులు అసూయ చెందేవారట. అయినా ఆమె తన సేవలను మానకుండా చేస్తుండగా ఒకనాడు స్పృహతప్పి పడిపోయింది. సైనికులకు వచ్చిన జ్వరమే ఆమెకు వచ్చింది. కాసిల్ ఆసుపత్రిలో ఆమెను రోగిగా చేర్చుకున్నారు. ఆమెను చూసి మిగతా రోగులు కన్నీరు కార్చారు. కొంచెం బాగవగానే ఆమె తిరిగి క్రిమియా, స్కూటరి ఆసుత్రుల మధ్య తిరుగుతూ రోగులకు సేవలందించేది. తాగుడుకు డబ్బు ఖర్చు పెట్టకండి, మీ ఇళ్లకు డబ్బు పంపండి, వారి భుక్తి గడుస్తుంది అని ఫ్లోరెన్స్ చెప్పేది. గ్రంథాలయాలు చదువుకునే గదులు అందరికీ అందుబాటులో ఉండేటట్లు చూసి అక్షరాస్యతను పెంచింది. ఆమె నోట్స్ ఆన్ హాస్పిటల్స్, నోట్స్ ఆన్ నర్సింగ్ అనే గ్రంథాలను రాయడమే కాకుండా, విక్టోరియా రాణికి, ప్రభుత్వ అధికారులకి హాస్పిటల్స్ బాగుకోసం అభ్యర్థనలను పంపింది. అప్పటి నుంచే నర్సులకు తప్పనిసరిగా శిక్షణను ఇవ్వడం ప్రారంభమైంది. 1860 జూన్ 24న నైటింగేల్ ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సేస్ అనే సంస్థను లండన్‌లో స్థాపించారు. ఆమె 'మదర్ ఆఫ్ మోడరన్ నర్సింగ్స్'గా గుర్తించారు. ఫ్లోరెన్స్ సలహాలతో మన దేశంలో మరణాల రేటు తగ్గింది. మళ్లీ ఒక ఫ్లోరెన్స్ పుట్టాలని కోరుకుందాం.
1910 ఆగస్టు 13న ఫ్లోరెన్స్ మరణించినా, సేవా నిరతిగల ప్రతి నర్సులో ఆమె కలకాలం జీవించి ఉంటుంది. కరోనా మహమ్మారి సమయంలో లక్షలాది మంది ప్రాణాలను రక్షించడానికి నర్సింగ్ సిబ్బంది ఫ్రంట్‌లైన్ యోధులుగా దృఢంగా నిలిచారు. వారు లక్షలాది మంది రోగులను నకిలీ, తప్పుడు వైద్య ఉత్పత్తుల ప్రమాదం నుండి రక్షించారు. సవాళ్లతో, ఈ మహమ్మారి అంతటా టీకాలు, ఇతర అవసరమైన మందులను నిర్వహించడం, పంపిణీ చేయడంలో నర్సింగ్ సిబ్బంది కీలకపాత్ర పోషించారు. దేశంలో ఇప్పటికే నర్సుల కొరత ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా భారతదేశానికి 2024 నాటికి 4.30 మిలియన్ల మంది నర్సులు అవసరం. నర్సులు ఎంత బాగా చేసినప్పటికీ వారికి ఇంకా సమాజంలో సరైన గుర్తింపు రావడం లేదు. వారికి జీతాలు కూడా తక్కువే. పనివేళలు మాత్రం చాలా ఎక్కువగా ఉంటాయి. ఆస్పత్రుల్లో నర్సులు చేసే పని ఎంతో కీలకమైనది. రోగులకు సేవ అందించడానికి నర్సులు ఎంతో కృషి చేస్తారు. కానీ వాళ్ల పనిని ఎవరూ గమనించరు. డాక్టర్ చేసే విధులను మాత్రమే చాలామంది పరిగణనలోకి తీసుకుంటారు. అందుకే నర్సులను చిన్నచూపు చూస్తారు. నర్సులకు ఉండే ముఖ్యమైన బాధ్యతల గురించి చాలామందికి తెలియదు. రోగుల ఆరోగ్యానికి ముఖ్యమైన బాధ్యతల గురించి చాలామందికి తెలియదు. రోగుల ఆరోగ్యానికి సంబంధించిన కచ్చితమైన



డాక్యుమెంటేషన్‌ను నర్సులు నమోదు చేసి వారికి సరైన చికిత్స అందేలా చూస్తారు. చాలామంది నర్సులు రోగులకు వారి వైద్యచరిత్ర గురించి ఇంతకుముందు ఎలాంటి రోగాల బారిన పడ్డారనే అంశాల గురించి తెలుసుకుంటారు. తద్వారా శస్త్రచికిత్సలు, ప్రస్తుత మందులు, అలెర్జీలు, సంబంధిత కుటుంబ వైద్య సమాచారం గురించి సమాచారం సేకరించడం ద్వారా ఈ ప్రక్రియను ప్రారంభిస్తారు. వారు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఏవైనా లక్షణాల గురించి రోగిని ప్రశ్నలు అడుగుతుంటారు. దీంతో రోగులకు సంబంధించి కచ్చితమైన వైద్య రికార్డులను నిర్వహిస్తుంటారు. చాలామంది నర్సులు వైద్యుడి ఆదేశంతో రోగులకు మందులు ఇచ్చి చికిత్సలను నిర్వహిస్తుంటారు. నర్సులు తమ రోగులకు చికిత్స ప్రణాళికను అభివృద్ధి చేయడంలో కూడా సహాయపడగలరు. నర్స్ ప్రాక్టీషనర్ల వంటి ప్రత్యేక నర్సులు డాక్టర్ అనుమతి లేకుండా మందులను సూచించగలరు. రోగికి సంబంధించి కొన్ని చికిత్సలలో గాయాలను శుభ్రపరచడం, డ్రెస్సింగ్ చేయడం, పట్టీలను మార్చడం, కాథెటర్‌లను చొప్పించడం వంటి పనులలో నర్సులు సహాయపడతారు. క్లిష్టమైన స్థితిలో ఉన్న రోగులకు అత్యవసర సంరక్షణ అందిస్తారు. రోగులకు అనేక రకాలుగా రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంలో నర్సులు కీలకపాత్ర పోషిస్తారు. వీళ్ల నిర్వహించే బాధ్యతల్లో కణజాలం, రక్తం, మలం లేదా మూత్ర నమూనాలను సేకరించడం వంటివి ఉంటాయి. రోగులను పరీక్షించి వాళ్లకు మెరుగైన చికిత్స అందించడానికి ఈ సమాచారం అవసరం కాబట్టి ఈ పరీక్షలు సరిగ్గా నిర్వహించబడుతున్నాయని నిర్ధారించుకోవడానికి నర్సులు శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. ఈ ఫలితాలను విశ్లేషించడానికి, వాటిలో వారు కనుగొన్న వాటిని వారి మిగిలిన వైద్యబృందంతో పంచుకోవడంలో కూడా నర్సులు ప్రధాన బాధ్యత తీసుకుంటారు. అవసమైతే రోగులతో శారీరక వ్యాయామం కూడా చేయిస్తారు.
నర్సులు రోగులకు సేవలు అందించే క్రమంలో వారు తీవ్ర అనారోగ్యం పాలౌతున్నారు. అనేక సందర్భాలలో రోగులకు సేవలు అందించే క్రమంలో వారు రాత్రివేళల్లో కూడా పనిచేయాల్సి ఉంటుంది. సమయానికి ఆహారం తినే అవకాశం కూడా వారికి ఉండదు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున జరుపుతారు. ప్రభుత్వం ఇదే స్థాయిలో నర్సుల దినోత్సవాన్ని జరపాలి. నర్సులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించాలి. వారి జీవన ప్రమాణాలలో మార్పులు తీసుకుని రావడానికి ప్రభుత్వం కృషి చేయాలి. అప్పుడే వారికి సరైన గౌరవం, గుర్తింపు లభిస్తాయి.

**- యం.రాంప్రదీప్,** తిరువూరు

కథ

# దురాశకు తగిన ఫలితం

**చంద్రయ్య** అనే వ్యవసాయకూలి ఉండేవాడు. ఒకరోజు పూరిల్లుపై తాటాకులు కప్పడానికి రామాపురం అనే గ్రామం వెళుతూ దారిలో సదానందుని ఆశ్రమంలోనికి వెళ్లి స్వామికి నమస్కరించాడు. 'సుఖీభవ' అన్నాడు సదానందుడు.

'స్వామీ, నాకు ఏదైనా ధనం లభించే మార్గం ఉపదేశించండి' అని వేడుకున్నాడు.

'నేను నీకు ధనం లభించే మార్గం చెప్పినా ప్రాప్తం లేనిదే ఆ ధనం నీకు దక్కదు' అన్నాడు సదానందుడు.



'స్వామీ, తమరు ధనం ఇవ్వండి దాన్ని ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు' అన్నాడు చంద్రయ్య.

'సరే నాయనా! నువ్వు వెళ్లే గ్రామం పొలిమేరలలో ఒక పనసచెట్టు కనిపిస్తుంది. ఆ చెట్టు మొదట్లో మట్టి పాత్ర నిండుగా బంగారం పలుకులు ఉంటాయి. సగం మాత్రమే నువ్వు తీసుకో. మిగిలిన సగం బంగారం పలుకులు మరో అభాగ్యుని కొరకు వదలివెళ్లు' అన్నాడు సదానందుడు.

బుద్ధిగా తలపూపి మరోమారు నమస్కరించి, రామాపురం పొలిమేరలకు చేరి, అక్కడ కనిపించిన పనసచెట్టు మొదట్లో తొవ్వి తన తలపాగాలో అక్కడ ఉన్న బంగారం అంతా మూట కట్టుకుని ఆ మూటను తలపై పెట్టుకుని రామాపురం చేరి, తను ఆకులు కప్పవలసిన ఇంటి చూరుకు బంగారు పలుకుల మూట వేళ్లాడదీసి, ఆ ఇంటిపైకి ఎక్కి ఆ యింటి యజమాని సహాయంతో తాటాకులు మార్చసాగాడు చంద్రయ్య. ఆ ఇంటి ఇల్లాలు చూరుకు చంద్రయ్య వేళ్లాడదీసిన బంగారు పలుకుల మూటను చూసి 'చంద్రయ్య అన్నా, ఈ చూరుకు వేళ్లాడదీసిన మూటేమిటి?' అన్నది. 'అదా కందిపప్పులే అమ్మా' అన్నాడు బిగ్గరగా. అతని అరుపుకు ఆ చుట్టుపక్కల వారంతా తిరిగి చంద్రయ్యని చూసారు. ఆ పూట వంటకు పప్పుచారు చేయదలచిన ఆమె, సాయంత్రం చంద్రయ్య ఇంటికి వెళ్లే సమయానికి కందిపప్పు తెచ్చి ఇద్దాం, ఇప్పుడు అవసరానికి వాడుకుందాం! అని చూరుకు వేళ్లాడుతున్న మూట విప్పి తన ఇంట్లో దాచుకుని, అంగడికి వెళ్లి కందిపప్పు తెచ్చి మూటకట్టి ఎప్పటిలా ఇంటి చూరుకు వేళ్లాడతీసింది.

సాయంత్రానికి పనిముగించుకున్న చంద్రయ్య చూరుకు వేళ్లాడతీసిన తన మూటను తలపై పెట్టుకుని తన గ్రామానికి బయలుదేరి సదానందుని ఆశ్రమం ముందుకు వచ్చాడు.

అప్పుడే ఆశ్రమం వెలుపలకు వచ్చిన సదానందుడు 'నాయనా, ఇంకా ఆ బంగారం నీవద్ద ఉందా?' అన్నాడు. 'తమరే చూడండి' అని తలపైన ఉన్న మూట నేలపై ఉంచి విప్పాడు. మూటలో కందిపప్పు కనిపించింది.

'నాయనా నేను ముందే చెప్పాను, ప్రాప్తం లేనిదే ఏది మనకు దక్కదని. జరిగిందేదో జరిగిపోయింది. ఆ చెట్టుమొదట్లో నువ్వు వదిలివచ్చిన సగం బంగారం వెళ్లి తెచ్చుకో' అని సదానందుడు తన ఆశ్రమంలోనికి వెళ్లిపోయాడు. అత్యాశతో ఉన్న బంగారం అంతా మూట కట్టుకుపోయి తాను తప్పు చేసినందుకు చింతించాడు చంద్రయ్య.

**- డా॥ బెల్లంకొండ నాగేశ్వరరావు**

## చుక్కలు కలపండి



వార్త ఆదివారం

## బాలగేయం

### చెల్లీ రావే!



చెల్లీ చెల్లీ రావే!
చిట్టి బొమ్మా తేవే
బొమ్మా నాకూ ఇస్తే
గౌను నేనూ ఇస్తా
చెల్లీ చెల్లీ రావే!
పప్పుబెల్లం తేవా
పప్పూబెల్లం ఇస్తే
పాయసం నేనూ ఇస్తా
చెల్లీ చెల్లీ రావే!
బంకామట్టి తేవా
బంకామట్టి ఇస్తే
బండి నేనూ ఇస్తా
చెల్లీ చెల్లీ రావే!
పలకా బలపం తేవా
పలకా బలపం తెస్తే
చదువు నేను నేర్పిస్తా!

**- డి.కె.చదువులబాబు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.ఎస్.కౌశిక్,** కాకినాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వాతావరణంలోని మార్పులను శాస్త్రీయంగా ఎలా గుర్తిస్తారు?**

**జవాబు:** కౌశిక్! కోట్లకొద్దీ గ్రహాలు, నక్షత్రాలతో కళ్లు మిరుమిట్లు గొలిపే అంతరిక్షం అనే అద్భుత ప్రపంచం నుంచి కొన్ని శక్తివంతమైన కిరణాలు, రేణువులు నిరంతరం మనం భూవాతావరణంలోకి ప్రవేశిస్తుంటాయి. ఆ విధంగా ప్రవేశించిన ఆ ప్రత్యేక మైన రేణువుల ఆధారంగా మన భూ ఉపరితల వాతావరణంలో చోటు చేసుకునే మార్పులను ముందుగానే గుర్తించవచ్చని శాస్త్రజ్ఞులు ఊహిస్తున్నారు. అంతరిక్షం నుంచి కొన్ని కాస్మిక్ కిరణాలు వాతావరణం పైపొరలను ఢీకొనగానే వాటి నుంచి కొన్ని రేణువులు వానజల్లుగా ఉద్భవించి భూ వాతావరణంలోకి ప్రవేశిస్తాయి.

**- పి.మధులిక,** మానుకొండూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మనుష్యులకు ఉన్నట్లుగా చెట్లకూ పంచేంద్రియాలు/ఇంద్రియ జ్ఞానాలు ఉంటాయా?**

**జవాబు:** మధులిక! చెట్లు, చేమల విషయంలో పరిశీలిస్తే చెట్లు కాంతి, స్పర్శ అనే రెండు ఇంద్రియ జ్ఞానాలతో బతికేస్తుంటాయి. మనిషి మాత్రం ఈ రెండింటితో పాటు కాంతిలోని తేడాలను కూడా గుర్తిస్తాడు. వాటి ద్వారా వస్తువులను, వ్యక్తుల రూపురేఖలను గుర్తించగలుగుతాడు. శబ్దాలను వినగలగడంతో పాటు, గొంతు స్వరాలను గుర్తించడం, సంగీతాన్ని ఆస్వాదించడం, సంక్లిష్టమైన రసాయన మిశ్రమాలను వాసన చూస్తాడు. అదే సమయంలో నిర్దిష్ట రసాయనాల మిశ్రమాన్ని ఐస్‌క్రీమ్ అనీ, కాఫీ అని వేరువేరుగా చేసి గుర్తిస్తాడు. శరీర అవయవాల ద్వారా అందుకునే సంకేతాలకు మెదడు చేర్చే అదనపు విలువే 'ఇంద్రియజ్ఞానం' అని అర్థమవుతుంది. పంచేంద్రియాలకు జ్ఞాపకశక్తి, అనుభవాలు తోడైతేనే సమగ్రంగా ఇంద్రియజ్ఞానం అలవడుతుంది.

# ఆటోమేటిక్ కుకింగ్ పాట్



**సాధారణంగా** ప్రతి వంటకానికీ తప్పనిసరిగా గరిటెను తిప్పాల్సిందే. పైగా మాడిపోకుండా, అడుగంటకుండా చూసుకుంటూ వంట పూర్తి అయ్యేదాకా అక్కడే ఉండాల్సి వస్తుంది. కానీ ఈ స్మార్ట్ డివైజ్ అలాంటి తలనొప్పులకుచెక్ పెట్టేస్తుంది. ఇందులో హైక్వాలిటీ మెటీరియల్‌తో రూపొందిన ఆరులీటర్ల పాత్ర ఉంటుంది. అది 360 డిగ్రీలు గుండ్రగా తిరుగుతూ ఆహారాన్ని ఉడికిస్తుంది. ఫ్రైలు, డీప్‌ఫ్రైలు చేసిపెడుతుంది. ఈ మెషిన్‌కి బలమైన స్టాండ్ ఉంటుంది. దానికి అటాచ్ అయ్యి ఉన్న డివైజ్‌లో ఆ పాత్రను సులభంగా అమర్చుకోవచ్చు. ఆ పాత్ర పక్కనే అన్నీ ఉంటాయి. ఇందులో ఫ్రైడ్ రైస్ దగ్గర నుంచి బిర్యానీల వరకూ అన్ని రైస్ ఐటమ్స్. అన్ని రకాల కర్రీస్‌ను రెడీ చేసుకోవచ్చు. దీనికి ట్రాన్స్‌పరెంట్ మూత కూడా ఉంటుంది. అలాగే క్లీనింగ్ సమయంలో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారైన ట్రేను డివైజ్ ముందు పెట్టి ఈజీగా క్లీన్ చేసుకోవచ్చు.

---

# మినీ ఫుడ్‌కోర్ట్

**ఇలాంటి** మెషిన్ వంట గదిలో ఉంటే ఎలాంటి వెరైటీలను అయినా నిమిషాల్లో సిద్ధం చేసుకోవచ్చు. ఉదయాన్నే అల్పాహారం దగ్గర నుంచి రాత్రి భోజనం వరకూ అన్నిటినీ ఘుమఘుమలాడే రుచులతో వండుకోవచ్చు. ఈ డివైజ్. ఓవైపు టోస్టర్‌లా, మరోవైపు స్టీమర్‌లా లేదా గ్రిల్‌లా పనిచేస్తుంది. దాంతో బ్రెడ్ టోస్టర్‌లు, ఆమ్లేట్స్, చికెన్ వింగ్స్, కట్లెట్స్, పాన్‌కేక్స్, బర్గర్స్, శాండ్విచ్‌లు లాంటివెన్నిటినో తయారు చేసుకోవచ్చు. జొన్నకండెలు, దుంపలు వంటివి స్టీమ్ చేసుకోవడంతోపాటు..సూప్స్ వంటివీ కాచుకోవచ్చు. దీనికి ఒక ప్రత్యేకమైన బౌల్ ఉంటుంది. ఇందులో గ్రిల్, పాన్, బౌల్ ఇలా అన్నింటికీ హ్యాండిల్ ఉంటుంది. దీనిపైన వంట ఎంత సులభమో..క్లీనింగ్ కూడా అంతే ఈజీ.




---

# ట్రెండీ గ్రిల్

**ఈ** రోజుల్లో వంటగదిలో కుక్‌వేర్ కూడా ఇంటీరియల్ డిజైన్ కిందే లెక్క. ఆ కోవలోనిదే ఈ డివైజ్. కంటికి ఇంపైన రూపం, వండివార్చే సామర్థ్యం. ఎక్కడైనా ఇమిడిపోయే సౌకర్యం దీని సొంతం. ఇందులో సూప్స్, ఫ్రైలు, డీప్‌ఫ్రైలు, రకరకాల రైస్ ఐటమ్స్, చికెన్, మటన్ సహా ఎన్నో వెరైటీ కర్రీస్‌ను తయారు చేసుకోవచ్చు. డివైజ్‌కి ముందు పైభాగంలో డిస్‌ప్లేలో టెంపరేచర్, టైమింగ్స్ అన్నీ కనిపిస్తాయి. ఈవంట పాత్రకు ప్రత్యేకమైన హ్యాండిల్ ఉంటుంది. కుడివైపు రెగ్యులేటర్ సాయంతో దీనిపై వంట చాలా తేలికగా ముగుస్తుంది.



**ఎన్నో** ఏళ్లుగా లండన్ చదువులు అంటే ప్రపంచంలో పేరుపొందింది. సూర్యుడు అస్తమించని సామ్రాజ్యంగా బలపడడంతో విద్యాభ్యాసరంగం కూడా ఎంతో పేరు పొందింది. మనకి స్వతంత్ర్యం రాకమునుపు



# లండన్‌లో ఉన్నత చదువు

ఉన్నత విద్యకోసం లండన్ వెళ్లడం పరిపాటి. సమాజంలో గొప్ప కూడా. మనదేశంలో పేరుపొందిన వారు ఎక్కువమంది లండన్‌లో చదువుకున్న వారు. యు.కె. అని పిలవబడే యునైటెడ్ కింగ్డమ్‌లో ప్రపంచం నలుమూలల నుండి చదువు కోసం ఇక్కడికి వస్తుంటారు. మరి పదకొండవ శతాబ్దం నుండి ఇక్కడ విశ్వవిద్యాలయాలు పని చేస్తున్నాయి. ఉన్నత చదువులకు పరిశోధనలకు ఇంగ్లాండ్ పెట్టింది పేరు. 2009లో ప్రముఖ కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం 800 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఐరోపా ఉత్తర పశ్చిమాన ఉన్న ద్వీపదేశం యు.కె. ఇందులో స్కాట్లాండ్, వేల్స్, ఇంకా ఐర్లాండ్ కలసి యునైటెడ్ కింగ్డమ్ అంటారు. థేమ్సు నదీతీరంలో ఉన్న నగరం లండన్ యు.కె. రాజధాని. సుమారు రెండువేల సంవత్సరాల విద్య, వ్యాపార సంస్కారాలతో పేరుపొందిన మహానగరాలు బర్మింహాం, మాంచెస్టర్, లీడ్స్, లివర్‌పూల్, బ్రిస్టల్, న్యూకాజిల్, యార్క్, ఆక్స్‌ఫోర్డ్, యునైటెడ్ స్టేట్స్, ఆస్ట్రేలియా తరువాత యుకెలో విద్యార్థులు ఎక్కువగా చదువుకి ఉద్యోగానికి, వ్యాపారానికి వస్తున్నారు. సామాజిక సాంఘిక సారూప్యత వలన మనదేశానికి లండన్‌లో సౌకర్యం ఎక్కువ. ముఖ్యంగా యుకె విద్యావిధానమే మనదేశంలో కూడా ఉంది. పైగా ఆంగ్లంలో బోధన మనకి సులువైంది. ప్రపంచంలోని టాప్‌టెన్ యూనిర్సిటీలో నాలుగు యుకెలోనే ఉన్నాయి అంటేనే గొప్ప విషయం. యుకెలో పేరు పొందిన యూనివర్సిటీలు..యూనిర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి, యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫోర్డ్, ఇంపిరియల్ కాలేజీ లండన్, యూనివర్సివటీ కాలేజీ లండన్, ది యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బరో, ది యూనిర్సిటీ ఆఫ్ మాంచెస్టర్, కింగ్స్ కాలేజ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ గ్లాస్గో, యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్, యూనివర్సిటీ ఆఫ్ బ్రిమింగ్ హామ్, ది యూనివర్సిటీ ఆఫ్ సెఫీల్డ్ వంటివి చదువుకి పరిశోధనలకు పెట్టింది పేరు. యుకెలో చదవడానికి రెండు ముఖ్యమైన స్కాలర్‌షిప్‌లు ఉన్నాయ్. అవి కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్, షెవెనింగ్ స్కాలర్‌షిప్. మనదేశ విద్యార్థులకి కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్ ఎంతో ఉపయోగకరమైనవి. ఇక్కడ అండర్ గ్రాడ్యుయేట్, మాస్టర్స్, డాక్టరొల్, పోస్ట్ డాక్టరొల్ రీసెర్చ్ వంటి కోర్స్‌లు ఉన్నాయి. అలాగే రెండు రకాల మాస్టర్స్ ప్రోగ్రామ్స్ ఉన్నాయి. అవి టాట్ మాస్టర్స్ డిగ్రీ, రీసెర్చ్ మాస్టర్స్ డిగ్రీ మొదటిది ఒక సంవత్సరము రెండవది రెండు సంవత్సరాలు చదవాలి. పిహెచ్‌డి ప్రొగ్రాం తక్కువలో మూడు సంవత్సరాలు కొనసాగించాలి. యుకెలో ఉన్నత విద్యను చదివేందుకు ముందుగా సుమారు ఆరునెలల డాక్యుమెంటేషన్ పనులు చూడాలి. అందుకు విద్యార్థికి ఏది ఇష్టమో గ్రహించాలి. దానికి తగిన యూనివర్సిటీ ఎంచుకోవాలి. మనం ఎంచుకున్న యూనివర్సిటీల వెబ్‌సైట్ ద్వారా వివరాలను సరిపోల్చాలి. తగిన స్కోర్ పొందేవిధంగా టెస్ట్‌లు పాస్ కావాలి. యుకెలో ఆంగ్లం ముఖ్యం కనుక ఐఈఎల్‌టి ఎస్ టోఫెల్ వంటి టెస్ట్‌లు పాస్ కావాలి. యుకెలో ఉండి చదవడానికి కావలసిన సొమ్ము బ్యాంకుఖాతాలో ఉండాలి. కోర్స్ ప్రారంభం అవడానికి ఆరుమాసాల ముందుగా స్టూడెంట్ వీసా కోసం దరకాస్తు పెట్టాలి. సాధారణంగా స్టడీవీసా నలభైలక్షల రూపాయలు ఖర్చు అవుతాయి. వసతి, భోజనం ఖర్చు కోసం మరో లక్ష రూపాయలు కావాలి. యుకెలో మంచి వాతావరణంతోపాటు, పరిణితి చెందిన పౌరులు, విద్యారంగంలో ఉన్నతమైన అనుభవం ఉండడం మన విద్యార్థులకి ఎంతైనా సౌకర్యవంతం.






**- ఈ.ఎస్.మాధవన్**

కథ

# ట్రస్ట్

గన్నవరపు నరసింహమూర్తి

**ఇంటి ముందు ఆటో ఆగగానే గుమ్మంలో కూర్చొని పేపరు చదువుతున్న రమణయ్య ఆటోవైపు చూసాడు.**

**అందులోంచి అతని కూతురు దీప దిగి, ఆటోవాడికి డబ్బులిచ్చి గేటు తీసుకొని లోపలికి వస్తోంది. ఆ సమయంలో చెప్పాపెట్టకుండా, కనీసం ఫోనైనా చెయ్యకుండా వస్తున్న కూతుర్ని చూసి అతను ఆశ్చర్యానికి లోనయ్యాడు.**

**వెంటనే పేపర్ని పక్కన పెట్టి "ఏమ్మా! బాగున్నావా?" అని పలకరించాడు.**

**ఆమె "ఆ.." అని క్లుప్తంగా సమాధానం ఇచ్చి లోపలికి వెళ్లింది.**

రమణయ్యకు ఆమె ప్రవర్తన వింతగా అనిపించింది. ఎప్పుడు వచ్చినా "నాన్నగారూ" అంటూ తనను పట్టుకొని ఎన్నో విషయాలను అడిగిగానీ లోపలికి వెళ్లేది కాదు. అటువంటిది ఈరోజు అందుకు భిన్నంగా ప్రవర్తించడం రమణయ్యను ఆలోచనల్లో పడేసింది.

రమణయ్య కలెక్టర్ ఆఫీసులో సూపరింటెండెంట్, భార్య విమల. అతనికిద్దరు



పిల్లలు. పెద్దవాడు శ్రీహరి, టీచరు ఉద్యోగం చేస్తున్నాడు. అతని కోడలు సుశీల కూడా టీచరే.

కూతురు దీపాంజలి. సంవత్సరం క్రితం పెళ్లయింది. అల్లుడు శ్రీవత్స హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. దీప కూడా కంప్యూటర్స్ చదవడంతో అక్కడే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పెళ్లయిన తరువాత చేరింది. కొడుకు, కోడలు అతని వద్ద ఉంటారు.

పెళ్లయిన తరువాత వచ్చిన సంక్రాంతికి దీప, అల్లుడు శ్రీవత్స ఇద్దరూ కలిసి వచ్చి వారం రోజులున్నారు. అప్పుడు వాళ్లిద్దరూ ఎంతో సంతోషంగా అందరితో కలసి మెలసి ఉన్నారు.

అల్లుడు మంచివాడు. మృదుస్వభావి కావడంతో రమణయ్య, విమల దంపతులు చాలా సంతోషించారు.

కానీ ఆ తరువాత వాళ్లిద్దరూ కలిసి రాలేదు. అయినా వాళ్లిద్దరి మధ్య పొరపొచ్చాలున్నాయన్న అనుమానం ఎప్పుడూ రాలేదు రమణయ్యకు.

కానీ ఇప్పుడు కూతురు దీప ఒంటరిగా రావడం, ముభావంగా ఉండటంతో ఆ అనుమానం కలిగింది.

రమణయ్య ఇలా ఆలోచిస్తూ ఆఫీసుకు వెళ్లడానికి తయారయ్యేడు. వెళ్లేముందు కొడుకు శ్రీహరిని పిలిచి దీపతో మాట్లాడమని చెప్పి ఆఫీసుకి వెళ్లిపోయాడు.

శ్రీహరి కూడా ఆఫీసుకి వెళ్లేముందు దీప గదిలోకి వెళ్లి చెల్లెల్ని పలకరించాడు.

"చెల్లీ! ఏంటీ? నువ్వొక్కర్తివే వచ్చావు? అదీ మాకెవ్వరికీ చెప్పలేదు. బావ రాలేదేం? ఏమిటి కారణం?" అని అడిగాడు.

"నాకూ, శ్రీవత్సకు పడటం లేదు. ఇంక అతనితో ట్రావెల్ చెయ్యలేను. విడిపోదామని నిర్ణయించుకున్నాను" అంది దీప జడ వేసుకుంటూ.

"విడిపోతావా? వాడ్డూ యూ మీన్? నువ్వు తెలివుండే మాట్లాడుతున్నావా? అది అంత సులభమా? ఇదేం అమెరికా అనుకున్నావా? అయినా ఇటువంటి సీరియస్ నిర్ణయాన్ని నువ్వొక్కర్తివే ఇంత త్వరగా ఎలా తీసుకుంటావు? మాతో చెప్పక్కర్లేదా?" ఆవేశంతో చెల్లెల్ని ప్రశ్నించాడు శ్రీహరి.

"బాధపడేదాన్ని నేను. మీకు చెబితే ఏం చేస్తారు? నా నిర్ణయం తప్పంటారు. తొందరపడొద్దని చెబుతారు. జీవితాంతం అతనితో ప్రయాణం చెయ్యవలసినదాన్ని. నా కన్నా ఇంకెవ్వరూ ఈ విషయంలో సరియైన నిర్ణయం తీసుకోలేరు" తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది.

ఆ మాటలు మాట్లాడుతున్నప్పుడు ఆమె పెదవులు వణకటాన్ని అతను గమనించాడు. చెల్లెలి నిర్ణయాన్ని అతను జీర్ణించుకోలేకపోయాడు. ప్రశాంతంగా సాగిపోతున్న తమ కుటుంబంలో చెల్లెలి నిర్ణయం ఒక పెను తుఫాన్ని సృష్టిస్తుందని అతను ఆందోళన చెందసాగేడు. ముఖ్యంగా తండ్రి ఈ నిర్ణయాన్ని జీర్ణించుకోలేడని అతని అభిప్రాయం. ఈ నిర్ణయం తండ్రి ఆరోగ్యం మీద ప్రభావం చూపుతుందనీ భయపడ్డాడు.

"అసలు మీ ఇద్దరి మధ్య ఏం జరిగింది?" కొంచెం వివరంగా చెబితే తెలుస్తుంది. అయినా ఇటువంటి నిర్ణయాన్ని పుట్టింటివాళ్లకి చెప్పకుండా ఎలా తీసుకున్నావు?" ఆవేశంగా అడిగాడు శ్రీహరి.

"ఏం జరిగిందంటే ఏమి చెప్పను? ఒకటా! రెండా! ఎన్నో! నా యిగోని ఎన్నో సార్లు హర్ట్ చేసాడు. నేను ఆఫీసు నుంచి ఆలస్యంగా వస్తే ఇంత ఆలస్యమా? అని విసుక్కుంటున్నాడు. ఆఫీసులో స్టాఫ్ పార్టీలకు వెళితే అలా మగవాళ్లతో హోటల్స్‌కి వెళ్లడమేమిటి? అని ప్రశ్నిస్తూ నా శీలాన్ని శంకిస్తున్నారు.

నా జీతం నా ఇష్టం.. కానీ నా ఖర్చుల వివరాలడుగుతున్నాడు. నేనంటే ఇంటిని నిర్వహిస్తున్నాను కాబట్టి అతన్ని లెక్కలు అడుగుతాను కానీ అతను నా ఖర్చులు గురించి అడగటం నాకు అవమానం కాదా? నన్ను అనుమానించినట్లు కాదా? ఆఫీసుకు నేను వేసుకుంటున్న డ్రస్సుల్ని కూడా ప్రశ్నిస్తున్నాడు. ఈ కారణాలు చాలవా? నేను ఈ నిర్ణయం తీసుకోవడానికి" అని కోపంగా చెప్పింది దీప.

"నువ్వు చెప్పిన కారణాల్లో ఏ ఒక్కటీ సీరియస్ అయినది కాదు. ఆఫీసు నుంచి ఆలస్యంగా వస్తే భర్త అడగటం తప్పెలా అవుతుంది? దానికి నువ్వు ఆలస్యంగా ఎందుకు వచ్చావో చెబితే సరిపోతుంది కదా! అదే అతను ఆలస్యంగా వస్తే నువ్వు అడగవా? మీ వదిన ఆలస్యంగా వస్తే నేను కూడా అడుగుతాను. అలాగే ఆఫీసులోని మగవాళ్లతో హోటల్స్‌కి పార్టీ కోసం వెళ్లడం కూడా నా దృష్టిలో అంత మంచి పని కాదు. అక్కడ వాళ్లు తాగినపుడు ఆ మైకంలో అసభ్యంగా ప్రవర్తించే అవకాశాలు చాలా ఎక్కువ. బహుశా బావ కూడా అందుకే వెళ్లొద్దని చెప్పి ఉంటాడు. అలాగే భార్యాభర్తల మధ్య ఖర్చుల విషయంలో పరస్పర అవగాహన ఉండాలి. ఒకరి ఖర్చుల విషయం ఇంకొకరికి తెలియకపోవడం మంచిది కాదు. దీనివల్ల కమ్యూనికేషన్ గేప్ ఏర్పడుతుంది. కాబట్టి నువ్వు చెప్పిన కారణాలన్నీ నువ్వు అనుకున్నంత తీవ్రమైనవి కావు. వీటికే విడిపోదామన్న నిర్ణయం అంత మంచిది కాదు. నీ నిర్ణయం మన కుటుంబంలో చాలా మంది మీద ప్రభావం చూపుతుంది. కాబట్టి తొందరపడి ఇటువంటి నిర్ణయం తీసుకోకుండా కొన్నాళ్లపాటు ఇక్కడ ఉండి వెళ్లు. సమస్యలన్నీ అవే తీరిపోతాయి. ఈ విషయంలో నేను కూడా శ్రీవత్సతో మాట్లాడుతానులే. నాకు చెప్పిన విషయాలు అమ్మా నాన్నలకు చెప్పొద్దు. వాళ్లు తట్టుకోలేరు" అని చెల్లెలికి చెప్పి ఆఫీసుకి వెళ్లిపోయాడు శ్రీహరి.

తను చెప్పిన విషయాలు విని "మంచి పని చేస్తున్నావు" అని అంటాడనుకున్న అన్నయ్య తద్విరుద్ధంగా మాట్లాడటం దీపకు ఆశ్చర్యం కలిగించింది. ముఖ్యంగా కుటుంబంలో ఎవరికీ తన నిర్ణయం ఆమోద యోగ్యం కాదనీ చెప్పకనే చెప్పాడు.

ఆమె ఆలోచిస్తూ చాలాసేపటి వరకు అక్కడే కూర్చొంది.

ఇంతలో తల్లి టిఫిన్‌కి పిలవడంతో డైనింగ్ టేబుల్ దగ్గరికి వెళ్లింది. అక్కడ వదిన సుశీల తన కోసం తినకుండా ఎదురు చూస్తూ కనిపించడంతో త్వరత్వరగా టిఫిన్ ముగించి గదిలోకి వెళ్లిపోయింది.

విమల కూడా కూతురు గదిలోకి వచ్చి ఆమె ముభావంగా ఉండటంతో వెళ్లిపోయింది.

పది గంటలప్పుడు దీప స్నేహితురాలు నీరజ ఆమెకి ఫోన్ చేసింది "హాయ్ దీపా! ఎక్కడ?" అని అడిగింది.

"నేను ఉదయాన్నే గోదావరికి ఇక్కడికొచ్చాను" అని చెప్పింది దీప.

"ఇక్కడికొచ్చావా? మరి చెప్పలేదు. చెబితే నేను మీ ఇంటికి వచ్చేదాన్ని కదా! అయినా ఏం పరవాలేదు, ఇప్పుడే మీ ఇంటికి వస్తున్నాను" అంది నీరజ.

"నీరజా! నాకు బయట పనుంది. నేనే నీ దగ్గరికి వస్తాను" అని చెప్పి పావు గంట తరువాత ఆటోలో నీరజ దగ్గరికి బయల్దేరి అరగంట తరువాత నీరజ ఇంటికి చేరింది.

దీపని చూడగానే నీరజ ఆటో దగ్గరికి పరుగున వచ్చి ఇంట్లోకి తీసుకెళ్లింది. నీరజ అమ్మగారు సరోజ దీపని చూసి "చాలా రోజులైంది దీపా, నిన్ను చూసి.. బాగున్నావా?" అని అడిగింది.

"బాగున్నాను ఆంటీ" అని చెప్పి నీరజతో కలిసి డాబా మీదకు వెళ్లింది.

"హాయ్ దీపా! ఎక్కడ?" అని అడిగింది.
"నేను ఉదయాన్నే గోదావరికి ఇక్కడికొచ్చాను" అని చెప్పింది దీప.
"ఇక్కడికొచ్చావా? మరి చెప్పలేదు. చెబితే నేను మీ ఇంటికి వచ్చేదాన్ని కదా! అయినా ఏం పరవాలేదు, ఇప్పుడే మీ ఇంటికి వస్తున్నాను" అంది నీరజ.

డాబా మీద నుంచి చూస్తే ఊరంతా కనిపిస్తోంది. డాబా మీదకు వాలి ఉన్న మామిడిచెట్టు నీడలో కుర్చీల్లో కూర్చున్నారిద్దరూ. ఇంతలో సరోజ వాళ్లిద్దరికీ కాఫీలు తెచ్చిచ్చింది.

ఇద్దరూ కాఫీలు తాగుతూ కబుర్లు చెప్పుకుంటూ ఉంటే సరోజ వంట చెయ్యాలంటూ కిందకు వెళ్లిపోయింది.

"ఏం దీపా! ఎప్పుడో నా పెళ్లప్పుడు నాలుగేళ్ల క్రితం నిన్ను కలిసాను. ఆ తరువాత మనం కలవడం కుదర్లేదు. నీ పెళ్లి రెండేళ్ల క్రితం అయిందని అమ్మ చెబితే తెలిసింది. నువ్వు కూడా ఉద్యోగం చేస్తున్నావట కదా. ఎలా ఉంది నీ కాపురం? నీ హబ్బీ ఎలా ఉంటాడు?" అని ప్రశ్నల వర్షం కురిపించింది నీరజ.

"బానే ఉంది" ముభావంగా చెప్పింది దీప.

"అమ్మవి అయ్యావా? లేదా? అవబోతున్నావా?" నవ్వుతూ అడిగింది నీరజ.

దీప కూడా ఆ మాటలకు చిన్నగా నవ్వుతూ "లేదే.. ఇంకా టైముంది. అది సరే. నువ్వెక్కడ ఉన్నావు? బెంగళూరులోనా? ఇంకెక్కడికైనా మారారా? ఈ ఊరెప్పుడు వచ్చావు?" అని అడిగింది దీప.

ఆ మాటలకు అప్పటిదాకా నవ్వుతూ మాట్లాడుతున్న నీరజ ఒక్కసారిగా మౌనం దాల్చింది.

ఆమె ముఖంలో రంగులు మారటాన్ని దీప క్రీగంట గమనించింది. ఆ తరువాత నీరజ మౌనం వీడింది.

"నేనిక్కడికి వచ్చి సంవత్సరం అయిందే..." అంది మెల్లగా.

"సంవత్సరమైందా? ఆర్యూ జోకింగ్, నీ హబ్బీ ఫారెన్ గట్రా వెళ్లాడా?" అని అడిగింది దీప.

"లేదే.. అతను బెంగళూరులోనే ఉన్నాడు. మేమిద్దరం డైవర్స్ తీసుకున్నాం" అంది.

నీరజ నోట్లోంచి వచ్చిన పిడుగు లాంటి ఆ మాటలకు దీప నిశ్చేష్టురాలైంది. కొద్దిసేపటిదాకా ఆమె నోటంట మాటలు రాలేదు. "ను.. నువ్వు చెప్పింది నిజమేనా?" అని ఆశ్చర్యపోతూ అడిగింది దీప.

"నిజమేనే. ఈ విషయంలో అబద్ధం ఎందుకు చెబుతాను" అంది నీరజ.

"కారణం?"

"ఒకటనీ కాదు. ఎన్నో ఉన్నాయి. కానీ ఇప్పుడు తల్చుకుంటే అవన్నీ సిల్లీగా కనిపిస్తున్నాయి. నిజంగా పెళ్లి విషయంలో సరియైన అవగాహన లేకపోవడం వల్ల నేనే తొందరపడ్డాను. అయినా ఇప్పుడనుకొని ప్రయోజనం లేదనుకో" నూతిలోంచి వస్తున్నట్లున్నాయి నీరజ మాటలు.

ఆమె గొంతులో విషాదం ధ్వనిస్తోంది.

దీప కొద్దిసేపు మౌనం దాల్చింది. నీరజ మాటలు ఆమె జీర్ణించుకోలేకపోతోంది.

"పెళ్లయిన తరువాత నేను, రవితో ఆనందంగా కాపురానికి బెంగళూరు వెళ్లాను. మా అమ్మ నాతో పాటు వచ్చి నెల రోజులు వుండి వెళ్లిపోయింది. మొదటి ఆరు నెలలు బాగా గడిచాయి. నేనూ ఉద్యోగంలో చేరాను.

అప్పట్నుంచీ నాలో కోపం ప్రవేశించింది. ఆ ఉద్యోగంలోని టెన్షన్స్ భరించలేక రవి మీద కోప్పడేదాన్ని. రవి చాలా నెమ్మదస్తుడు. నన్ను ఉద్యోగం మానెయ్యమని సలహా ఇచ్చాడు. అయినా నేను వినలేదు. ఒకసారి అతని ఆఫీసులో కొలీగ్ మా ఆఫీసుకొచ్చి రవి ఒకమ్మాయితో తిరుగుతున్నాడనీ, జాగ్రత్త పడమనీ సలహా ఇచ్చాడు. అప్పట్నుంచీ మా ఇద్దరి మధ్యా సన్నటి గీత మొదలై అది గోడగా మారింది. ఒకరోజు ఆ విషయమై రవిని నిలదీసాను. అతను "అది నిజం కాదనీ, మౌనిక తన కొలీగ్ అని, తాను గ్రూప్ లీడర్‌నని, అంతేతప్పా వాళ్లిద్దరి మధ్యా ఏవిధమైన సంబంధం లేదనీ చెప్పినా నేను వినిపించుకోలేదు. ఆ తరువాత జీవితం నరకమైంది. అతను ఆలస్యంగా వచ్చినప్పుడు నేను నిలదీయడం, నేను మా కొలీగ్ స్కూటర్ మీద ఇంటికి వచ్చినప్పుడు అతను నన్ను అనుమానించడం, కొన్నాళ్ల మాట్లాడుకోకపోవటం.. అలా మొదలైన చిన్న క్రేక్ సంవత్సరం తిరిగేసరికి పెద్ద పగులై ఇద్దరికీ దూరం పెంచింది.

ట్రస్ట్ అన్నది చాలా చిన్న మాట. కానీ అది చాలా విలువైనది. భార్యా భర్తల అనుబంధానికీ, అన్యోన్య దాంపత్యానికీ మూలమైన ఆ ట్రస్ట్.. ఒకసారి కోల్పోవడం మొదలైతే అది ఇంతింతై.. వటుడింతై అన్న చందాన పెరిగి పెద్దదవుతుంది. అదే మా విషయంలోనూ జరిగింది. ఒకరి మీద ఒకరికి ట్రస్ట్ పోయింది. మా అమ్మా నాన్నలు, వాళ్ల అమ్మ, నాన్నలు వచ్చి ఎంతో సర్ది చెప్పిన తరువాత అతను రాజీకి ఒప్పుకున్నాడు. కానీ నేనందుకు ఒప్పుకోక మొండిపట్టు పట్టాను. ఫలితం.. విడాకులు. రెండేళ్ల తరువాత మేం కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నాం. ఆ తరువాత అక్కడే ఆరు నెలలు ఉద్యోగం చేసాను. కానీ నాకెందుకో అతను ఉన్న చోట నాకుండబుద్ధి కాలేదు. అందుకే ఇక్కడికొచ్చేసాను" నీరజ చెబుతుంటే దీప మౌనంగా వినసాగింది.

"మరిప్పుడేం చేస్తున్నావు?" భవిష్యత్తు గురించి ఏమాలోచించావు?"

"మొదట్లో నా నిర్ణయం సరియైనదేనని అనిపించింది. కానీ రాను రాను నాలో మార్పు వచ్చింది. ఇప్పుడు నేను తొందరపడి తప్పు చేసానేమోనన్న అపరాధ భావన కలుగుతోంది.

"కారణం?"

"ఈ సమాజం.. ఎంత తల్లిదండ్రులు, తోబుట్టువులైనా మన భావాలతో, నిర్ణయాలతో వాళ్లు ఏకీభవించరు, జీవితాంతం తోడుండలేరు. అందుకు వాళ్లకున్న బాధ్యతలు కారణం అవుతాయి. నా వల్ల నా చెల్లెలి పెళ్లి అవడానికి ఇబ్బందులు వచ్చాయి. విడాకులు తీసుకున్న స్త్రీకి సమాజం విలువ ఇవ్వదు. నా వల్ల మా అన్నయ్య ఇంట్లోంచి వెళ్లిపోయాడు. మా చెల్లెలు ఇంటర్ కాస్ట్ మేరేజ్ చేసుకొని వెళ్లిపోయింది. ఇప్పుడు నన్నందరూ దోషిగా చూస్తున్నారు. ఎవరైనా చుట్టాలు వస్తే నన్ను పిలవడానికి అమ్మ మొహమాటపడుతోంది. చిన్నతనంగా భావిస్తోంది. పోనీ మళ్లీ పెళ్లి చేసుకుందామన్నా డైవర్సీని పెళ్లి చేసుకునేందుకు ఎవ్వరూ ముందుకు రారు. ఒకవేళ చేసుకున్నా దానికుండే సమస్యలు దానికున్నాయి. ఇదీ నా జీవితం" చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంటూ చెప్పింది నీరజ.

నీరజ చెప్పిన మాటలు విన్న తరువాత దీప మౌనం దాల్చింది. మాటలు రావటం లేదు. ఏం చెప్పాలో తోచక అరగంట తరువాత ఇంటికి బయలుదేరి వచ్చేసింది.

మర్నాడుదయాన్నే గోదావరికి దీప భర్త శ్రీవత్స మామ గారింటికి వచ్చాడు.

ఉదయాన్నే ఆటో దిగుతున్న అల్లుడిని చూసి ఆశ్చర్యపోయాడు రమణయ్య.

విమలలో ఏదో అనుమానం కలిగింది.

శ్రీహరికైతే చెల్లెలు దీప అతనితో ఎలా ప్రవర్తిస్తుందోనన్న భయం వేసింది. కానీ ఆశ్చర్యంగా దీప వచ్చి అతని బేగు అందుకుంది. అతన్ని తన గదిలోకి తీసికెళ్లింది. స్నానానికి నీళ్లు పెట్టింది.

స్నానం తరువాత అతనికి ఇష్టమైన వేడి వేడి ఉప్మా చేసి పెట్టింది. తరువాత ఇద్దరూ కలిసి వేంకటేశ్వరుడి గుడికి వెళ్లారు.

చెల్లెలి ప్రవర్తనకు విషయం తెలిసిన శ్రీహరి ఆశ్చర్యపోయాడు.

కూతురు, అల్లుడు అన్యోన్యంగా ఉండటం చూసి ఆ దంపతులిద్దరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆ మర్నాడు దీప టిఫిన్ తింటూ "అమ్మా! నిన్ను, నాన్నను చూడాలనిపించటంతో వెంటనే బయలుదేరి వచ్చేసాను. ఆఫీసులో చాలా పని ఉంది. అందుకే ఒక్కరోజే సెలవిచ్చారు.

శ్రీవత్స నేను లేకుండా ఉండలేడు. అందుకే తనూ వచ్చేసాడు. ఈసారి దసరాకి వారం రోజులు సెలవు పెట్టి వస్తాములే; అందుకని ఈరోజు గోదావరికి వెళ్లిపోతాం" అని చెప్పింది.

కూతురి మాటలకు విమల ఎంతో సంతోషించి, భర్త రమణయ్యకు చెబితే అతనూ సంతోషించాడు.

దీప మాటలు ఆ దంపతులకు ఆనందం కలిగించాయి.

ఆ సాయంత్రం దీప, శ్రీవత్స వెళ్లిపోయారు.

రెండు నెలల తరువాత దీప తాను నెల తప్పానని వాళ్లమ్మకి ఫోన్ చేసి చెప్పింది. ●


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని మాతృదేశం నుండి పారదోలే సమర చరిత్రలో నాటి సమర యోధులు, కవులు, రచయితలు, సాహితీవేత్తలు యితర మేధావులు అఖండ భారతావనిలో పత్రికా రచనలకు, యితర సాహిత్య రచనలకు ప్రాధాన్యమిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం, స్వాతంత్ర్య సమరంలో రాజకీయ పార్టీల సిద్ధాంత భావజాలం, సోషలిజం స్వాతంత్రోద్యమాన్ని ప్రభావితం చేసింది. స్వాతంత్ర్యం రాక పూర్వమే ప్రఖ్యాత రచయిత ప్రేమ్‌చంద్, సజ్జాద్ జహీర్ వంటి ప్రగతిశీల రచయితలు 'ప్రోగ్రెసివ్ రైటర్ అసోసియేషన్', వేసి పదునెక్కించాయి. 1965లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. తదనంతర రాజకీయ పరిణామాలలో "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను" అన్న మహాప్రస్థాన మహాకవి శ్రీశ్రీ, షష్ఠిపూర్తి పేరుతో 1970 జులై 3న అధ్యక్షతన 'విరసం' ఉద్భవించింది.

## 'సృజన' సాహితీ వేదికగా..

తెలుగు సాహిత్య లోకంలో, అభ్యుదయం వెల్లివిరిసిన దశాబ్దాలలో క్రమేపీ సాహిత్యంలోని వివిధ ప్రక్రియలకు రాజకీయ సిద్ధాంతం, పునాది అయింది. 1966లో సాహితీ మిత్రుల పక్షాన, భారతిలో 'సూర్యున్ని ప్రేమించాను' కవితలో "సూర్యున్ని ప్రేమించడమేమిటి, వెర్రిగాకపోతే, దగ్ధమని పోవాలని లేకపోతే.." అంటూ, ఆ కవిత చివరలో "హృదయమా! నీకు చురుక్కుమని తాకిన ఈ వేడి, ఇన్నాళ్లు నీలో దాగిన అగ్నిదే" అంటారు వరవరరావు. ఆనాటి అభ్యుదయ కవిగా సుమారు నాలుగు శతాబ్దాలు అరసం అయినా విరసం అయినా శ్రీశ్రీ తెలుగు సాహిత్యాన్ని శాసించారు.

60వ ఏట కత్తి వంటి కలం పట్టిన

# అభ్యుదయం నుంచి విప్లవం వైపు.. వీరశైవ సాహిత్యం



ఇప్టా వంటి సంస్థల ఏర్పాట్లు ప్రోత్సహించారు. తెలుగు నేల మీద ఆ విధంగా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రజా నాట్యమండలి 1940లో ఏర్పాటు అయ్యాయి. దానికితోడు ప్రపంచ రాజకీయ నేపథ్యంలో సామ్యవాదం, ప్రజాస్వామ్యం సాధించిన విజయాలు, నవభారత్ నిర్మాణానికి ప్రేరణ యిచ్చాయి. తెలుగునాట 1943 నుంచి 1955 రాజమండ్రి 'అరసం' మహాసభల వరకు, శ్రీశ్రీ అధ్యక్షునిగా ఉన్నాడు. స్వాతంత్ర్యానంతరం తతెత్తిన రైతాంగ సాయుధ పోరాటం వాటి అరసం, ప్రజానాట్యమండలికి సవాలుగా పరిణమించింది. కమ్యూనిస్టు సాయుధ తిరుగుబాటు, నైజాం, బ్రిటిష్ పాలనలపై తిరుగుబాటు పోరాటాలలో 'అరసం' నాటకాలు, బుర్రకథలు పాటలు జానపద సాహితీ సాంస్కృతిక పరంగా విజృంభించింది.

1930లో శ్రీశ్రీ ఉద్యమ జీవితం ప్రారంభమైంది. స్పెయిన్, అంతర్యుద్ధానికి కర్టెన్ రెయిజర్‌లాగ "జయభేరి గీతం రాసేనాటికి ప్రపంచవ్యాప్తంగా నాజీజం, ఫాసిజంకు వ్యతిరేకంగా సామ్యవాద, ప్రజాస్వామిక శక్తుల పోరాటం, ప్రజాపక్షమైంది. సామ్యవాద శక్తుల విజయం, తెలుగు కవులను కదిలించింది. ఇంతలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, అరసం, ప్రజానాట్యమండలి అడుగు ముందుకు ఆధునిక అభ్యుదయ సాహిత్య వేదికగా 'సృజన' పత్రిక ఆవిర్భవించింది. ప్రతిభావంతుడైన కవి, అభ్యుదయ సాహితీవేత్తగా, 'సృజన' సంపాదకుడు పెండ్యాల వరవరరావుకు శ్రీశ్రీ, తిలక్, చలం ముగ్గురితో సాహితీ జీవన యానంతో తాదాత్మ్యం ఏర్పడి 'సృజన' అపూర్వ అధ్యాయం సృష్టించగలిగింది. ప్రజలే చరిత్ర నిర్మాతలని సాహిత్య లక్షణాన్ని, లక్ష్యాన్ని నిర్దేశించుకొన్న ఎందరో నిబద్ధ సాహితీవేత్తలకు, నాటి యువకులకు శ్రీశ్రీ ఆదర్శంగా ఆరాధ్యనీయుడయ్యాడు. 1966 నుంచి నాలుగు సంవత్సరాలు సృజన, అరసం వేదికగా అనిర్వచనీయమైన చరిత్ర సృష్టించింది. కానీ నాటి కాలమాన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, అభ్యుదయం, విప్లవంగా యుద్ధోన్ముఖం అయింది. చరిత్ర గతి మారిపోయింది. 17వ ఏట, సోవియట్ రష్యా 'లైకా' శునకాన్ని, అంతరిక్షంలోకి పంపిన సందర్భాన్ని 'సోషలిస్టు చంద్రుడు'గా తొలి కవిత రాసిన, 'తెలంగాణ విమోచనోద్యమం–తెలుగు నవల' సిద్ధాంత గ్రంథంతో డాక్టరేటు పొందిన, తొలి కవితా సంపుటి చలినెగళ్లు(1968) వంటి అత్యుత్తమ కవితా సాహిత్యాన్ని సృష్టించిన వరవరరావు 1970 తరువాత విప్లవ రచయితగా 16 సార్లు నిర్బంధింపబడి, సంవత్సరాల తరబడి జైలుశిక్షలు ఎదుర్కొంటున్నారు. 1968 ఏప్రిల్ విప్లవ పథ నిర్దేశకుడు శ్రీశ్రీ, 1983 జూన్ 15న కన్ను మూయడంతో, ఆయన జీవిత కాలంలో 13 సంవత్సరాలు మాత్రమే విప్లవ లక్ష్య దిశ చూడగలిగాడు. కవిగా, ప్రజా కవిగా అభ్యుదయ కవితా పంథాను మలుపు తిప్పిన శ్రీశ్రీ, మార్క్సిజం–లెనినిజం మీద నమ్మకం లేనివాడు, అభ్యుదయ రచయిత కాలేదని ఒక ఇంటర్వ్యూలో అన్నాడు. "మీ కవిత్వానికి మార్క్సిజంకు గల సంబంధం ఎలాంటిది?" అన్న ప్రశ్నకు సమాధానంగా "మహా ప్రస్థానం అన్న గీతం రాసేనాటికి నాకు మార్క్సిజం గురించి తెలియదు. నేను మార్క్సిజం గురించి తెలుసుకున్నది సాహిత్యం ద్వారానే, కానీ రాజకీయాల ద్వారా కాదు" అన్నారు.

"పెండ్యాల వరవరరావు కవిత్వంలో అన్వయ కాఠిన్యం లేదు. అతని వాఙ్మయ పరిశీలనలు మార్క్సిజం వెలుగుతో ప్రదీపితమైనవి. జీవితాన్ని చదివి అర్థం చేసుకొని కావ్యరచన చెయ్యగలిగిన వరవరరావు లాంటివారు ఏ కాలంలోనైనా కొద్ది మందే వుంటారు" అన్నారు శ్రీశ్రీ విరసంలో వీరశైవులు ప్రస్తావనలో. "విరసం మీ మెల్లకంటి చూపులకు ఆనకపోవచ్చు. వెయ్యి మంది విశ్వనాథలు మా వరవరరావొక్కడికీ దీటు కారు" అన్నారు.

ఏది ఏమైనా శ్రీశ్రీ సాహిత్య ఉద్యమ యాత్రలో అభ్యుదయం నుంచి ఉద్భవించిన విరసం, భవిష్యత్తు ప్రయాణంలో ఎటువంటి మజిలీ చేరగలదో కాలమే నిర్ణయిస్తుంది.

**- జయసూర్య**

# కుక్కలున్నాయ్ జాగ్రత్త!

ఒకరిని చూసి "నా దగ్గర నీ తోకాడించకు.. నీ పప్పులేవీ నా దగ్గర ఉడకవు.." అనడం కద్దు. అలా అంటున్నారంటే అతనేదో గిల్లికజ్జాలకు వస్తున్నాడని అర్థం. కానీ మనమెవరం ఓ కుక్కను చూసి తోకాడించకు అని చెప్పం, చెప్పలేం. ఎందుకంటే కుక్క మన దగ్గర తోకాడిస్తోందంటే అది మనకు తన కృతజ్ఞతను తెలుపుతోందని మనం అనుకుంటాం. కానీ అది కాదంటారు అందుకు సంబంధించిన నిపుణులు.

ఓ కుక్క తన తోకను అటూ ఇటూ ఊపుతోందంటే అది భయంతో కావచ్చు. అంతేకాదు, కుక్కతో మనం స్నేహంగా ఉంటేనే అది తోక ఆడిస్తుంది. అలాగే ఆవేశంలో ఉన్నా అది తోకాడిస్తుంది. ఆందోళనలో ఉన్నా తోకాడిస్తుంది. సంతోషంగా ఉన్నా తోకాడిస్తుంది. కనుక అదేదో ప్రేమతో తోక ఊపుతోందనుకుని దాని దగ్గరకెళ్లి సమస్యను కొనితెచ్చుకోకూడదు.

కుక్క గురించి నాకు బాగా తెలుసు



అని చెప్పేవారు కూడా దాని దగ్గరకు వెళ్లి ప్రమాదంలో పడిన సంఘటనలున్నాయి. అందుకే నిపుణులు చెప్తున్నదేమిటంటే- కుక్కలు ఉన్నట్టుండి వచ్చి మనుషులను కరవవట. కరవడానికి ముందు వాటిని గమనించవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. వాటిని సరిగ్గా అర్థం చేసుకోగలిగితే మనం వాటి నుంచి తప్పించుకోవచ్చు.

ఓ ఇంటికి వెళ్తున్నాం అనుకోండి.. అక్కడ కొత్తగా ఓ కుక్కను చూస్తున్నారనుకోండి.. వెంటనే దాని దగ్గరకు వెళ్లి వంగి నవ్వుతూ దాని తల మీద నిమురుతాం. ఇదా చాలా తప్పు.

ఓ కుక్క ఇంకొక కుక్కను తిన్నగా చూసి దంతాలు చూపిస్తోందంటే అది తన గొప్పతనాన్ని చూపుతున్నట్టు అర్థమట. ఎలాగంటే నీ కన్నా నేను ఎంతో పెద్దవాడిని అన్నట్టు దాని భావం. అందువల్ల దాని దగ్గరకు వెళ్లి నవ్వుతూ పళ్లు చూపిస్తే అది మిమ్మల్ని శత్రువుగా భావిస్తుందట.

ఇంకొక విషయం.

తల మీద కొట్టినట్టు చేస్తే కుక్కకు నచ్చదట. దానిని అణగదొక్కడానికి వచ్చినట్టు, భయపెట్టడానికి వచ్చినట్టు అనుకుంటుందట కుక్క.

సరే, అలాగైతే కొత్తగా ఓ చోట లేదా ఎవరింట్లోనైనా కుక్కపిల్లను చూసినప్పుడు ఏం చేయాలి?

మీరు ఉత్తినే ఉండాలి. అది తానుగా దగ్గరకు రావాలి. ఆ తర్వాతే దానితో నెమ్మదిగా పలకరించాలట. అందుకే కుక్క తల మీద మాత్రం మెల్లగాగానీ, కాస్తంగా గట్టిగా గానీ కొట్టకూడదు. ఓ కుక్క మిమ్మల్ని చూసి పరుగెత్తుకు వస్తుంటే దాన్ని చూసి భయపడి పరిగెత్తామంటే అది మనల్ని వెంటపడి తరుముతుంది. కనుక పరుగెత్తకుండా ఉన్నచోటనే ఆగిపోవాలి. అప్పుడది దగ్గరకు రాదు, మనల్ని పట్టించుకోకుండా పక్క నుంచి వెళ్లిపోతుంది.

ఓ వీధిలో చిన్న పిల్లలు అనేకమంది ఆడుకుంటున్నారు. అప్పుడు కొన్ని కుక్కలు అక్కడికి పరుగెత్తుకుంటూ వచ్చాయి. వాటిని చూసి అందరూ పరుగెత్తారు. అలా పరుగెత్తుతున్న వారిలో ఒకడు కాలు అడ్డు పడి కింద పడ్డాడు. అప్పుడేమైందో తెలుసా?

తరుముకుంటూ వచ్చిన కుక్కలు కింద పడిన వాడిని ఏమీ చెయ్యలేదు. అతని దగ్గరకే వెళ్లలేదు. పరుగెత్తుతున్న పిల్లల వెంట పడ్డాయవి. అది కుక్కల స్వభావం.

ఓ కుక్క మనల్ని నేరుగా గుర్రున చూస్తోందనుకున్నప్పుడు దానికేసి మనం గుర్రున చూడకూడదు. మనం దానికేసి కాకుండా ఇంకొక వైపు చూడాలి.

ఓ కుక్క కోపంగా ఉంటే దాని తోక నిటారుగా పైకి లేచి నిలబడుతుంది.

ఓ కుక్క భయపడిపోయినా అది దాని తోకను రెండు కాళ్ల మధ్యకు పోనిస్తుంది. కుక్క మనల్ని చూసి భయపడినంత మాత్రాన మనకు ప్రమాదమేమీ లేదని అనుకోకూడదు.

చాలా మంది భయపడి కుక్కతో కరిపించుకుంటుంటారు. కుక్కలు ఒక్కొక్కసారి ఎదురుపడ్డ మనిషి తన కన్నా పెద్దవాడని, వాడి దగ్గర చిక్కుకున్నాం కదా! అనే ఆలోచనలో కరవడానికి ఉపక్రమిస్తుంది.

ఇలాగే గొలుసుతో కట్టివేయబడిన కుక్క కూడా ప్రమాదకరమే. అదేపనిగా ఇరవై నాలుగు గంటలూ కుక్కను కట్టి ఉంచితే దాని స్వభావం మారిపోతుంది. అదెప్పుడు ఏం చేస్తుందో ఊహించలేం. దాని వల్ల లేనిపోని చిక్కులు తప్పవు.

పిల్లలను కుక్క కరుస్తుందని కొందరంటారు కానీ అది పూర్తి నిజం కాదు. అలాగని కుక్కలు పిల్లలను కరవవు అనుకోకూడదు. పిల్లలను ఒంటరిగా కుక్కల దగ్గర విడిచిపెడితే ప్రమాదకరమే. ఒక్కోసారి ప్రాణాలూ పోవచ్చు. కనుక కుక్కల గురించి ఎన్నో విషయాలు తెలుసుకోవాలి.

నాకు తెలిసిన ఒకడు తన మిత్రుడి ఇంటికి వెళ్లాడు. ఆ మిత్రుడు తన ఇంట్లో భోజనం చేయవలసిందేనని బలవంతం చేశాడు. దాంతో చేసేదేమీ లేక అతను వాళ్లింట్లో భోంచేయడానికి సరేనన్నాడు.

పళ్లెంలో అన్నం వడ్డించారు, మిత్రుడు తినడం మొదలుపెట్టాడు.

మిత్రుడి ఇంట్లో కట్టి ఉంచిన కుక్క అతనిని చురచురా చూసింది.

"మీ కుక్క నా వంక చురచురా చూస్తోందేమిటి?" అని మిత్రుడిని అడిగాడు. అప్పుడు ఆ మిత్రుడు "దానికో దుర్గుణం ఉంది. అది దాని పళ్లెంలో ఎవరు తిన్నా వారి వంక అలానే చురచురా చూస్తుందని" అన్నాడు.

**- యామిజాల జగదీశ్**

# ముక్తిక్షేత్రం 'శ్రీ విష్ణు పాదగయ'

**యుగ యుగాల నుండి గయ హిందువులకు అత్యంత పవిత్ర ప్రదేశం. జన్మ జన్మల పాపాలను హరించే ముక్తి క్షేత్రంగా శతాబ్దాలుగా ప్రశస్తి చెందింది. ఇంతటి ప్రాముఖ్యం రావడానికి సంబంధించిన పౌరాణిక గాథలు అన్ని యుగాలకు చెందినవి. వాయు, గరుడ, కూర్మ, పద్మ, వరాహ పురాణాలతో పాటు రామాయణ, మహా భారతాలలో ప్రస్తావించబడ్డాయి.**



### పౌరాణిక గాథ

సత్య యుగంలో గయాసురుడు అనే అసురుడు అమిత విష్ణు భక్తుడు. తన ఇష్టదైవం అనుగ్రహంతో తన శరీరాన్ని తాకినవారు ముక్తిని పొందే వరం పొందాడు. తన మరణం ఒక్క త్రిమూర్తుల చేతిలోనే సంభవించాలన్న చిత్రమైన మరో వరం కూడా దక్కించుకొన్నాడు. వర ఫలం అందరికీ దక్కాలన్న సదుద్దేశంతో తన శరీరాన్ని విపరీతంగా పెంచసాగాడు.



అసురుని విపరీత చర్యలతో దేవతలు భయభ్రాంతులైపోయారు. కారణం ఏమిటంటే నరకం పూర్తిగా ఖాళీ అయింది. ప్రతిఒక్కరూ స్వర్గానికే చేరసాగారు. దేవతల అనుగ్రహం కోసం చేసే యజ్ఞ యాగాదులు సంపూర్ణంగా నిలిచిపోయాయి. దేవతలు అశక్తులుగా మారిపోయారు. దేవతల విన్నపాల మేరకు త్రిమూర్తులు బ్రాహ్మణ రూపాలలో గయాసురుని వద్దకు వెళ్లారు. ఉచిత రీతిన అతిథి సత్కార్యాలు చేసిన తరువాత అతను వారి రాకకు కారణం అడిగాడు.

లోకాలకు మేలు కలిగించే దివ్యమైన యాగం ఒకటి చేయ తలపెట్టామని దానికి తగిన స్థలాన్వేషణలో ఉన్నామని తెలిపారు.


ఈ భూమండలంలో ఎక్కడైనా వారు స్థలాన్ని ఎంచుకోవచ్చని అసురుడు హామీ ఇచ్చాడు. తాకితేనే మోక్షాన్ని ప్రసాదించే అతని శరీరం కన్నా పవిత్ర స్థలం ఎక్కడ ఉంటుంది? అని వారు అనగానే తన దేహాన్ని యాగ వేదికగా వినియోగించుకోవడానికి సమ్మతించాడు.

అయితే వారం రోజుల పాటు నిర్వహించే యజ్ఞం సందర్భంగా గయాసురుడు కదలకూడదు. కదిలితే యాగం భగ్నం అవుతుంది. దానికి తగిన ఫలితాన్ని రాక్షసుడు అనుభవించాలి. అన్ని నిబంధనలకు అంగీకరించి, తన శరీరాన్ని పెంచి యజ్ఞ నిర్వహణకు అనువుగా పడుకొన్నాడు.

త్రిమూర్తులు హోమం వెలిగించి క్రతువును ఆరంభించారు. ఆరు రోజులు గడిచిపోయాయి. గయాసురునిలో ఎలాంటి చలనం లేదు. ఒక్కరోజు గడిస్తే అతన్ని ఎవరూ ఏమీ చేయలేరు. ఎలాగైనా అసురుని కదలించాలన్న నిర్ణయంతో ఇంద్రుడు కోడిలా మారి పెద్దగా కూత పెట్టాడు. గడువు పూర్తయిందని భావించిన గయాసురుడు కదిలాడు. దేవతలు అతని శరీరం మీద పెద్ద శిలను ఉంచారు. దాని మీద శ్రీ మహావిష్ణువు తన పాదాన్ని అదిమిపెట్టారు.

తన అంత్య కాలం సమీపించిందని అతనికి అర్థమైంది. నిశ్చల మనస్సుతో శ్రీహరిని ప్రార్థించాడు. బ్రహ్మ, శివ సమేతంగా శ్రీనివాసుడు తమ నిజ రూపాలతో దర్శనమిచ్చి మరణానంతరం కూడా అతని శరీరం పవిత్రమైనదిగా నిలుస్తుందని, ఎవరైతే గయా క్షేత్రం సందర్శిస్తారో వారి జన్మ జన్మల పాపాలు హరించిపోతాయని, గతించిన వారికి ఈ క్షేత్రంలో పిండ ప్రదానం చేస్తే సద్గతులు కలుగుతాయని వరం ప్రసాదించారు.

అలా గయాసురుని తల ఉన్న ప్రాంతాన్ని అతని పేరు మీద గయ(శిరోగయ) అని, బొడ్డు ఉన్న ప్రదేశం నాభిగయ(బిరజాదేవి, జాజ్‌పూర్, ఒడిస్సా) అని, పాదాలు ఉన్న స్థలం పాదగయ(పిఠాపురం)గా పిలవసాగారు. నాటి నుండి ప్రజలు తమ పూర్వీకులకు సద్గతులు కలగడానికి, తమ జీవిత కాలంలో చేసిన కర్మల నుండి విముక్తి కలగడానికి గయా క్షేత్రం సందర్శిస్తున్నారు.



రామాయణంలో శ్రీరామచంద్రులు తన తండ్రి దశరథ మహారాజుకు తర్పణాలు విడిచి, పిండప్రదానం చేసినట్టుగా పేర్కొన్నారు. అదేవిధంగా ద్వాపర యుగంలో పాండవులు ఇక్కడ కురుక్షేత్ర యుద్ధంలో మరణించిన వారందరికీ తిల తర్పణాలు, పిండప్రదానం చేసినట్లు తెలుస్తోంది.

## ఫాల్గు నది

శ్రీ విష్ణుపాద ఆలయం గయలో 'ఫాల్గు నది' ఒడ్డున ఉంటుంది. శ్రాద్ధ కర్మలను ఈ నదీ తీరంలోనే నిర్వహిస్తారు.

గంగతో సమానంగా భావించే ఈ నది సాక్షాత్తు విష్ణు స్వరూపమని విశ్వసిస్తారు. ఫాల్గు అంటే కోరిన కోర్కెలు తీర్చే కామధేనువు అని అర్థం. వ్యాసభగవానులు మహాభారతంలో ఈ నదిని 'నిరంజర'గా పేర్కొని మహిమను విపులంగా వివరించారు.

గయకు సుమారు వంద కిలోమీటర్ల దూరంలోని 'కోరంబే పహార్'గా పిలిచే పర్వతాలలో ఉద్భవించే 'లిలజన్' (నిరంజర), 'మోహన' అనే రెండు నీటి ప్రవాహాలు గయ వద్ద సంగమించి 'ఫాల్గు' నదిగా మారతాయి.

ఆలయానికి పడమర దిశలో ఉన్న నదీ తీరానికి సులభంగా చేరుకోవచ్చు. ఇంతటి పవిత్రతను ఆస్వాదించబడిన ఫాల్గు నది సంవత్సరంలో అధిక భాగం ఎడారిని తలపిస్తుంది. దీనికి సంబంధించిన ఒక పురాణగాథ స్థానికంగా వినిపిస్తుంది.

శ్రీరాముడు లక్ష్మణ, సీతా సమేతులై పాదగయ వచ్చారట. అన్నదమ్ములు పిండ ప్రదాన కార్యక్రమానికి సిద్ధమవుతున్న సమయంలో జానకీదేవి నది ఒడ్డున కూర్చొని ఉన్నారట. ఆ కాలంలో పితృదేవతలు స్వయంగా వచ్చి పిండారాలను స్వీకరించి వారసులను ఆశీర్వదించి వెళ్లేవారని ప్రతీతి.

నీటి ప్రవాహంలో నుండి దశరథ మహారాజు వెలుపలికి వచ్చి కోడలిని పిండాలను ఇమ్మని అడిగారట. ఆయన కుమారులు క్రతువు చేయడానికి సిద్ధపడుతున్నారు, కొద్దిసేపు ఆగమని అభ్యర్థించింది సీతాదేవి.

దశరథుడు "ఆగలేను, ఇప్పుడే కావాలని" పట్టుపట్టారట. స్త్రీ పితృకార్యం చేయకూడదు. అందులోనూ తన వద్ద ఎలాంటి వస్తువులు లేవు" అని తన అశక్తతను తెలియపరిచిందట.

"అయితే ఇసుకతో చేసిన పిండాలను నాకు సమర్పించు, ఫర్వాలేదు" అన్న మామగారి ఆత్మను సంతృప్తి పరచడానికి ఫాల్గు నది, అక్షయ వాట్, ఆవు, బ్రాహ్మణుడు, తులసిమొక్కను సాక్షులుగా ఉంచుకొని ఇసుకతో చేసిన పిండాలను దశరథునికి అందించిందట. వాటిని స్వీకరించి కోడలిని ఆశీర్వదించి అదృశ్యులు అయ్యారట దశరథుడు.

పితృకార్యం పూర్తి చేసిన తరువాత పిండాలను అందుకోవడానికి తండ్రి గారి ఆత్మ రాకపోవడంతో శ్రీరాముడు చింతించాడు.

భర్తను ఓదారుస్తూ సీతాదేవి జరిగిన విషయం తెలియచెప్పింది. నమ్మలేదు దశరథ తనయుడు శ్రీరాముడు.

తన సాక్షులను పిలవగా ఒక్క 'అక్షయ వాట్' తప్ప మిగిలిన నాలుగూ అబద్ధం చెప్పాయట. దాంతో ఆగ్రహించిన భూజాత ఫాల్గు నది నీరు లేకుండా పోవాలనీ, గోపృష్ట భాగమే పూజార్హమని, గయలో తులసికి స్థానం ఉండదని, ఇక్కడి బ్రాహ్మణులు క్రతువు కన్నా కాసుల మీద వ్యామోహంతో గౌరవాన్ని కోల్పోతారని శాపం ఇచ్చిందట. నాటి నుండి ఫాల్గు నది ఇసుక ఎడారి మాదిరిగా కనిపిస్తోంది. కార్యక్రమాల నిమిత్తం నదిలో లోతుగా గోతులు తీసి ఉబికిన నీటితో పూర్తి చేస్తారు. సహజంగా విష్ణు ఆలయాలలో కనిపించే తులసిమొక్క గయలో కనిపించదు. ఆవు పృష్ట భాగాన్నే పూజిస్తాం కదా!

గయలో పాండాలు(పూజారులు) అధిక ధనం వసూలు చేయడానికి చెప్పే కథలకు అంతే లేదు. కాశీలోని హరిశ్చంద్ర ఘాట్, మణికర్ణికా ఘాట్ లలో నిరంతరం ఎలా శవ దహనాలు జరుగుతుంటాయో అలాగే ఇక్కడ కూడా ఫాల్గు నది ఒడ్డున జరుగుతుంటాయి. పునః జన్మ ఉండదు నమ్ముతారు.

## అక్షయ వాట్

అక్షయ వాట్ ఒక వట వృక్షం. ఈ వృక్షం నాలుగు యుగాల నుండి ఉన్నదని ప్రచారంలో ఉన్న గాథ ద్వారా అవతగతమవుతోంది. పునఃసృష్టికి ముందు సంభవించిన జల ప్రళయంలో శ్రీ మహావిష్ణువు వట పత్రం మీద కాలిబొటన వేలిని నోటిలో ఉంచుకొని చిన్న బాలునిగా కనపడతారు. ఆయననే 'వటపత్ర సాయి' అని పిలుస్తారు. నాడు ఆయన శయనించిన పత్రం ఈ వృక్షానికి చెందినది అని ఆ గాథ తెలియచెబుతోంది. అందుకే అక్షయ వాట్ అన్న పేరు వచ్చింది. పితృ రుణం తీర్చుకొనే కార్యక్రమం కొంత ఇక్కడ నిర్వహిస్తుంటారు.



త్రేతాయుగానికి ముందు నుండి ప్రజలలో విశేష ఆదరణ కలిగిన విష్ణు పాదగయ ఆలయాన్ని మొట్టమొదట ఎవరు నిర్మించారో తెలియదు. ఈ ప్రాంతాల మీద ఆధిపత్యం పొందిన ప్రతి ఒక్క రాజవంశం ఆలయాభివృద్ధికి కృషి చేసినట్లు తెలుస్తోంది.

పాత ఆలయాన్ని పునః నిర్మించి ప్రస్తుత రూపంలో మనకు అందించినది మాత్రం ఇండోర్ మహారాణి అహల్యాబాయి హోల్కర్. ఆలయానికి వెళ్లే మార్గంలో ఆమె పాలరాతి విగ్రహాన్ని గౌరవ సూచకంగా ఉంచారు. యాత్రికుల సౌకర్యార్థం నిర్మించిన వసతి గృహానికి ఆమె పేరే పెట్టారు. ఈ విగ్రహం పక్కనే తెలుగువారి కోసం తెలుగువారు ఏర్పాటు చేసిన శ్రీ మంగళగౌరీ బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం ఉంటుంది.

## ఆలయ విశేషాలు

ఆలయానికి కొద్ది దూరంలో ఉండే స్వాగత ద్వారం వద్ద నుండి నిలువుగా ఉండే విమాన గోపురం గుమ్మటంలా కనిపించే ముఖ మండపాలు ఆహ్వానం పలుకుతాయి. ఇక్కడ కుడి పక్కన చిన్న గుట్ట మీద శ్రీ కామాఖ్యదేవి మందిరం ఉంటుంది. ఆలయం వెలుపల ఎక్కువగా రంగులు, కార్యక్రమాలకు కావలసిన వస్తువులు అమ్ముతుంటారు.

ప్రవేశ ద్వారానికి దశావతార రూపాలను సుందరంగా మలచి నిలిపారు. ప్రాంగణమంతా ఎన్నో రకాల విష్ణు రూప శిల్పాలు కనపడతాయి. చూడగానే అవి చాలా పురాతనమైనవని తెలిసిపోతుంది. ఆలయం నుండి నదీ తీరానికి వెళ్లే మార్గంలో అక్షయ వాట్ దాటిన తరువాత శ్రీ గయ గదాధరుని మందిరం, పక్కనే శ్రీ సాక్షి వేణుగోపాల స్వామి సన్నిధి వస్తాయి. శ్రీ గణపతి, శ్రీ నారసింహ, శ్రీ కైలాసనాథ, శ్రీ గౌరీ ఉపాలయాలు ఉంటాయి. ప్రధాన గర్భాలయం మధ్యలో 'ధర్మశిల'గా పిలవబడే రాతి మీద సుమారు పదహారు అంగుళాల పొడవు, ఆరు అంగుళాల వెడల్పుతో శంఖు, చక్ర ముద్రలతో దర్శనమిస్తుంది విష్ణు పాదం.

చుట్టూ వెండితో ఒక హద్దులా నిర్మించారు. భక్తులు నేరుగా తాకవచ్చు, పూజాదికాలు, అభిషేకాలు స్వయంగా చేసుకోవచ్చు. గర్భాలయ అంతర గోడలలో శ్రీ వినాయక, శ్రీ మహావిష్ణు, శ్రీ నార సింహ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహేశ్వరుడు, పార్వతీదేవి ఆదిగా గల దేవీ దేవతా రూపాలను నిలిపారు.



ఆలయానికి చేరువలో శ్రీరామ సాగరం, శ్రీ దక్షిణార్క కుండం, వైతరణి లాంటి కోనేరులు ఉంటాయి. ఇవన్నీ భక్తుల పాపాలను ప్రక్షాళన చేస్తాయని గ్రంథాల వల్ల తెలుస్తోంది. కానీ వాటి ప్రస్తుత స్థితి స్నానం చేసేవారిని అనారోగ్యంపాలు చేసేవిగా ఉన్నాయి. పరిశుభ్రపరచాల్సి న అవసరం, వాటి పవిత్రతను పరిరక్షించాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

పిండ ప్రదానం గయకు ఈశాన్యంలో పది కిలోమీటర్ల దూరంలో ఉన్న 'ప్రేత శిల' వద్ద



జరిపించాలట. ఇక్కడ ఉన్న బ్రహ్మ పుష్కరిణిలో స్నానం చేసినవారి బ్రహ్మ హత్యా పాతకమైనా హరించుకొనిపోతుందని అంటారు. అయితే అక్కడ ఎవరూ స్నానం చెయ్యడం లేదు. అంతా ఫాల్గు నది ఒడ్డునే చేస్తున్నారు. పిత్రు రుణం తీర్చుకోవడానికి దేశం నలు మూలల నుండి యాత్రికులు ప్రతిరోజూ వేలాదిగా గయకు తరలి వస్తుంటారు.

భక్తిశ్రద్ధలతో తమ పితృ దేవతలకు తర్పణాలు, పిండదానాలు చేస్తుంటారు. అన్ని హిందూ పర్వదినాలలో విశేష పూజలు జరుపుతారు. ఆలయానికి సమీపంలో ఉన్న శ్రీ మంగళగౌరీ ఆలయం శక్తిపీఠాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ సతీదేవి స్థనం పడినట్లుగా స్థల పురాణం వల్ల తెలుస్తోంది. ఇక్కడే మన పాప పుణ్యాలను లెక్క రాసే చిత్రగుప్త ఆలయం లాంటి పురాతన ఆలయాలు చాలా కనపడతాయి.

ప్రధాన మందిరానికి సమీపంలోనే ఉన్న దక్షిణార్క(సూర్య) మందిరం తప్పక దర్శించాలి. మనం చేసే పితృ కార్యాలకు సాక్షిగా పురాణాలు పేర్కొన్న "శ్రీ ప్రపితామహేశ్వర" మందిరం తప్పనిసరిగా దర్శించాలి. విష్ణు పాద ఆలయ విమానంపై ఉన్న బంగారు కలశం, పతాక దర్శనాలు కూడా మోక్షదాయకాలని గ్రంథాలు తెలుపుతున్నాయి.

బీహారు రాష్ట్రంలో రాజధాని పాట్నా తరువాత పెద్ద పట్టణమైన గయలో యాత్రికులకు అన్ని రకాల సదుపా యాలు లభిస్తాయి. ఆలయ సమీపంలో ఎన్నో సత్రాలు, యాత్ర నివాసాలు ఉంటాయి. దేశంలోని అన్ని ప్రముఖ నగరాల నుండి రైల్లో నేరుగా గయకు చేరుకోవచ్చు. గయలో అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఉంది.

గౌతమ బుద్ధుడు జ్ఞానోపదేశం పొందిన బౌద్ధ గయ ఇక్కడికి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఎన్నో సంప్రదాయాల చిరునామా, మరెన్నో చారిత్రక విశేషాల సమాహారం అయిన గయ తప్పక దర్శించుకోవలసిన క్షేత్రం.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**



# వారఫలం


పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133


## మేషం



ప్రయాణం లాభిస్తుంది. ఆకస్మికంగా కోర్టు వ్యవహారాలకు హాజరు కావాల్సి వస్తుంది. వారాంతంలో రుణాలు చేయాల్సి వస్తుంది. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. వృత్తి వ్యాపారస్తులకు లాభాలు ఆశించిన మేరకు ఉంటాయి. బాల్య మిత్రులను కలుసుకుంటారు.

## వృషభం



ఆరోగ్య సమస్యలుంటాయి. వృథా ఖర్చులను నియంత్రించడంలో విఫలమవుతారు. చిరు వ్యాపారులకు పోటీ వున్నా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారికి సంతోషంగా గడుస్తుంది. శుభ కార్యాలకు హాజరవుతారు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు పెద్దలను సంప్రదించండి.

## మిథునం



శుభ కార్యాల్లో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలన సూచనలున్నాయి. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. కుటుంబ సమస్యలు తీరుతాయి.

## కర్కాటకం



ఆరోగ్య సమస్యలుంటాయి. సొంతింటి కల నెరవేరుతుంది. అకారణంగా మానసిక ఆందోళన చెందుతారు. వ్యాపారులకు పోటీ పెరిగినా ఎవరి లాభాలు వారికి వుంటాయి. ఉద్యోగాభివృద్ధి సంతోషం కలిగిస్తుంది. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. వృథా కాలక్షేపం చేస్తారు. స్త్రీలకు శుభ యోగం. సాహస నిర్ణయాలు తీసుకుంటారు.

## సింహం



శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. కుటుంబ సమస్యలు తీరుతాయి. ఉద్యోగులకు ఉన్నతాధికారం లభిస్తుంది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. తీర్థ యాత్రలు చేస్తారు. కళాకారులు, క్రీడాకారులకు సన్మాన యోగం. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఉత్సాహంగా గడుస్తుంది.

## కన్య



వృథా ఖర్చులుంటాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం కుదుట పడుతుంది. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఉద్యోగులకు స్థాన చలనం/పదోన్నతి సూచనలున్నాయి. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. ప్రతికూలతలున్నా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు.

## తుల



విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. ఉత్సాహంగా గడుస్తుంది. అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. నిరుద్యోగులకు ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది. కవులు, రచయితలకు ప్రోత్సాహం లభిస్తుంది. నూతన వాహన యోగం. శారీరక, మానసిక వత్తిడికి లోనవుతారు. కుటుంబ సభ్యుల మధ్య ఐకమత్యం ఏర్పడుతుంది.

## వృశ్చికం



సామాన్యంగా ఉంటుంది. రుణాలు చేస్తారు. ఉద్యోగులకు ఉన్నతాధికారుల వత్తిడి ఉంటుంది. వ్యాపారులకు వారాంతంలో రుణాలు లభిస్తాయి. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. భాగస్వామ్య వ్యాపారులకు లాభదాయకంగా వుంటుంది. స్త్రీలకు శుభ యోగం. కోర్టు వ్యవహారాలు సానుకూలం. ఆర్థిక వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. వృద్ధుల ఆరోగ్యం మెరుగవుతుంది. చర్చలు వాయిదా.

## ధనుస్సు



వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. వ్యాపారులకు పోటీ పెరిగినా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. గృహ, భూ వసతులు ఏర్పాటు చేసుకుంటారు. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. శక్తికి మించిన రుణాలు చేయడం సముచితం కాదు. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభించి పూర్తి చేస్తారు. ప్రముఖులను సందర్శిస్తారు.

## మకరం



విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. సాహితీ మిత్రులను కలుసుకుంటారు. శుభ కార్యాలకు హాజరవుతారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. చోర భయం పొంచి వుంది కనుక విలువైన పత్రాలు/వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి, సంయమనంతో వ్యవహరించడం మంచిది. బాల్య మిత్రులను కలుసుకుంటారు.

## కుంభం



ఉద్యోగం లభిస్తుంది. కోర్టు వ్యవహారాలు సానుకూలం. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. సొంతింటి కల నెరవేరే సూచనలున్నాయి. వ్యాపారులకు సమస్యలుంటాయి. వృథా సంచారం మానుకుంటే మంచిది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. కుటుంబ సభ్యుల మధ్య ఐకమత్యం ఏర్పడుతుంది. వాహన యోగం.

## మీనం



వృథా కాలక్షేపం చేస్తారు. సామాన్య ధన లాభం. కొత్త రుణాలు చేసి పాత రుణాలు తీరుస్తారు. ఉద్యోగులకు ఉన్నతాధికారం లభిస్తుంది. వాక్చాతుర్యంతో ముఖ్యమైన పనులు పూర్తి చేసుకుంటారు. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. ఆకస్మిక ప్రయాణం చేయాల్సి వస్తుంది. ప్రముఖులను సందర్శిస్తారు. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. శుభ వార్తలు వింటారు.

**వాస్తువార్త**



వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458


# వాయవ్యంలో మెట్ల అమరిక?

(గత వారం తరువాయి..)

వాయువ్యంలో మెట్ల నిర్మాణం గావించవలసి వస్తే (ఒక వరస మెట్లు) పశ్చిమ వాయువ్యంలో ఉత్తరం నుండి దక్షిణానికి ఎక్కేలా నిర్మాణం జరపవలసి ఉంటుంది. మెట్లెక్కి బాల్కనీలోకి ప్రవేశించి అక్కడి నుండి ఇంట్లోకి

పద్ధతి మెట్లకు అనువుకాదు. ఒక వరుస మెట్లు పశ్చిమ నైరుతిలో వేస్తే ఉత్తరం నుండి దక్షిణానికి ఎక్కేలా వేయాల్సి ఉంటుంది. కానీ ఆ మెట్ల నిర్మాణం నైరుతి మూలలో ఆగిపోతుంది. అలా పశ్చిమ నైరుతి ద్వారం గుండానే ఇంట్లోకి ప్రవేశించవలసి వస్తుంది. ఆ నడక

ఏదీ లేదు. కానీ బాల్కనీ వుంటే తూర్పు ఈశాన్యంలో కూడా తలుపు తెరుచుకునే అవకాశం ఉంటుంది. ఈ రకమైన మెట్ల నిర్మాణం ఒక ప్రత్యామ్నాయమే కానీ అతిశ్రేష్ఠమైంది మాత్రం కాదు.

దక్షిణ నైరుతిలో ఒక వరుస మెట్ల

ఉచ్ఛస్థానంలో నుండి అంటే పశ్చిమ వాయువ్య ద్వారం గుండా లేక మధ్య స్థానం నుండి అంటే పూర్తి పశ్చిమ ద్వారం గుండా ప్రవేశించాలి. పశ్చిమ నైరుతి ద్వారం ఉండకూడదు. అటువంటి ద్వారం ఉండాల్సి వస్తే పశ్చిమ వాయువ్య ద్వారం తప్పకుండా వుండి, ఆ ద్వారం గుండానే నడక జరగాలి. పశ్చిమ నైరుతి ద్వారాన్ని వీలయినంత తక్కువగా వాడుతూ వాడుకలేని సమయాల్లో విధిగా మూసిపెట్టాలి. ఉత్తర వాయువ్యంలో మెట్లు కట్టడం శాస్త్ర సమ్మతమేగానీ ఒంటి వరుస మెట్ల విషయంలో అది సరైంది కాదు. ఎందుకంటే అటువంటి మెట్లు అక్కడ కడితే తూర్పు నుండి పశ్చిమానికి ఎక్కవలసి వస్తుంది. కాబట్టి వాయువ్య మూలన మెట్లు నిలిచిపోతే ఉత్తర వాయువ్య ద్వారం గుండా ఇంట్లోకి ప్రవేశించవలసి వస్తుంది. అది సరైన నడక కాదు.

ఒక వరుస మెట్లు పశ్చిమ వాయువ్యంలో కట్టుకున్నప్పుడు పశ్చిమంలో బాల్కనీ ఏర్పడుతుంది. కాబట్టి తూర్పున తప్పకుండా బాల్కనీ కట్టాలి. పశ్చిమాన వున్న బాల్కనీ కంటే తూర్పున ఉండే బాల్కనీ వెడల్పు కాస్తయినా ఎక్కువ ఉండాలి. ఉత్తర, దక్షిణాలలో తప్పకుండా బాల్కనీ కట్టాలన్న నియమం ఏదీ లేదు. ఒకవేళ సౌలభ్యం కోసం కట్టవలసి వస్తే దక్షిణాన కట్టే బాల్కనీ కంటే ఉత్తరాన కట్టే బాల్కనీ వెడల్పు కొంతయినా ఎక్కువ వుండాలి.

## నైరుతిలో ఒక వరుస మెట్లు

నైరుతిలో ఒక వరుస మెట్లు నిర్మించటం సరయిన పద్ధతి కాదు. నైరుతి మెట్ల నిర్మాణం వల్ల బరువు నైరుతిలో పెరగడం మంచిదే కానీ ఈ

మంచిది కాదు. అలాగే దక్షిణ నైరుతిలో ఒక వరుసమెట్లు వేస్తే తూర్పు నుండి పశ్చిమానికి ఎక్కేలా మెట్లు వేయాల్సి వస్తుంది. కానీ ఆ మెట్ల నిర్మాణం కూడా నైరుతి మూలలో ఆగిపోయి, దక్షిణ నైరుతి మూలలో ఆగిపోయి దక్షిణ నైరుతి తలుపు ద్వారా ఇంట్లోకి నడవవలసి వస్తుంది. ఇలా నడవటం మంచి ఫలితాలనివ్వదు.



నైరుతిలో రెండు వరుసల మెట్ల నిర్మాణం జరిగినప్పుడే ఇంట్లోకి మధ్య భాగం అంటే దక్షిణ లేక పశ్చిమ ద్వారాల నుండి ప్రవేశించవచ్చు. లేదా ఉచ్ఛస్థానాల నుండి అంటే పశ్చిమ వాయువ్యం లేదా దక్షిణ ఆగ్నేయ ద్వారాల నుండి ఇంట్లోకి ప్రవేశించవచ్చు. కాబట్టి ఒక వరుస మెట్ల నిర్మాణం చేసినప్పుడు అది నైరుతి భాగంలో చేయకపోవడం క్షేమకరం.

## నైరుతిలోనే ఒక వరుస మెట్ల నిర్మాణం అనివార్యమైతే..

పశ్చిమ నైరుతిలో ఒక వరుస మెట్లు కడితే ఆ మెట్ల నిర్మాణం ఉత్తరం నుండి దక్షిణానికి ఎక్కే విధంగా సాగి, నైరుతి మూలలో ఆగిపోతుంది. నైరుతి మూల నుండి దక్షిణ బాల్కనీలోకి నడక సాగాలి. దక్షిణ బాల్కనీలో నుండి దక్షిణ ఆగ్నేయ ద్వారంగుండా ఇంట్లోకి ప్రవేశించాలి. దక్షిణంలో వున్న బాల్కనీ కంటే ఉత్తరంలో కూడా మరింత వెడల్పయిన బాల్కనీ విధిగా కట్టాల్సి వుంటుంది.

పశ్చిమాన బాల్కనీ లేదు కనుక తూర్పున బాల్కనీ కట్టాలన్న నియమం

నిర్మాణం జరిపితే అది తూర్పు నుండి పశ్చిమానికి ఎక్కేలా సాగి నైరుతి మూలన ఆగిపోతుంది. నైరుతి మూల నుండి పశ్చిమాన బాల్కనీలోకి నడక సాగాలి. పశ్చిమ బాల్కనీలో నుండి పశ్చిమ వాయువ్య ద్వారం గుండా ఇంట్లోకి ప్రవేశించాల్సి ఉంటుంది. పశ్చిమాన బాల్కనీ కట్టినప్పుడు ఇంటికి తూర్పున కూడా (పశ్చిమాన ఉన్న బాల్కనీ కంటే) వెడల్పు మరింత పెద్దదిగా వుండేలా బాల్కనీ కట్టడం తప్పనిసరి. అలా తూర్పు ఈశాన్యంలో కూడా తలుపు అమరుతుంది. దక్షిణాన బాల్కనీ వుండదు కాబట్టి ఉత్తరాన బాల్కనీ కట్టడం తప్పనిసరి కాదు. బాల్కనీ ఉత్తరాన కూడా కట్టుకుంటే, ఉత్తర ఈశాన్యంలో తలుపు అమరే అవకాశం కలుగుతుంది. ఈ రకపు మెట్ల నిర్మాణం కూడా ఒక ప్రత్యామ్నాయమే కానీ అతి శ్రేష్ఠమైంది మాత్రం కాదు. ❐

సింగిల్ పేజీ కథ

# చివరి కోరిక

**లలిత** కాస్త కోపంగా చూస్తూ "మీకు మన ఇంటి పరిస్థితి తెలిసి కూడా మీ నాన్న గారి చివరి కోరిక తీరుస్తా నంటూ" అప్పులు చేస్తున్నారు. అడిగితే "నాకు తెలుసులే" అంటారు, అని ఆమె ఇంకేదో అనేంతలో–

"లలితా, కొందరికి చెప్పినా కొన్ని అర్థం కావు. నువ్వూ అంతే. మా నాన్న ఆ మధ్య తన పుట్టినరోజు నాటికల్లా ఓ కథల పుస్తకం అచ్చు వేయాలని ఉందని మరీ మరీ చెప్పాడు. నేను చూద్దాంలే! అని చాలా సార్లు దాటవేశాను. ఇపుడు ఆయన పోయాక, ఆయన స్నేహితుడు గిరి గారు కూడా ఆ విషయమే చెప్పి కళ్లు తుడుచుకున్నారు. ఆయన చెప్పేదాకా ఆ విషయం నాకు గుర్తు లేదు. గిరిగారు చెప్పినట్టు, ఆయన పోయాకైనా పుస్తకాలు ముద్రించి కొడుగ్గా ఆయన ఆఖరి కోరిక తీరుస్తాను. ఇక డబ్బంటావా? దాని గురించి నువ్వు బాధపడకు. వెధవడబ్బు, కుక్కని తంతే రాలుతుంది" చెప్పాడు శేఖర్ వ్యంగ్యంగా.

అది విన్న లలిత "అయితే డబ్బులు రాల్చే ఓ రెండు కుక్కల్ని మనింటికి తీసుకురండి" చెప్పింది.

"రెండు కుక్కలెందుకూ?" అడిగాడు అయోమయంగా.

"ఎందుకేవిటీ? మీకు డబ్బులు కావాల్సినప్పుడు మీ కుక్కని మీరు తన్ని డబ్బులు తీసుకోండి. నాకు కావాల్సిన ప్పుడు నేను నా కుక్కని తన్ని డబ్బులు తీసుకుంటాను" చెప్పింది వెటకారంగా.

"నీ బుద్ధి మారదు" అన్నాడు విసుగ్గా.

"పోయిన మీ నాన్నగారి చివరి కోరిక తీర్చడం కోసం ఇలా వేలకి వేలు తగలేసి ఆ పుస్తకం అచ్చు వేయిస్తారా?"

"తప్పదు.. అచ్చు వేయిస్తే ఆయన చివరి కోరిక తీర్చానన్న తృప్తి మిగులుతుంది నాకు. అలానే ఇది వేయించినా నష్టం ఏమీ ఉండదు. కొనుక్కునేవారు కొనుక్కుంటారు. మనకి తెలిసిన నాలుగు అయిదు సూపర్ మార్కెట్స్‌లో పుస్తకాలు పెడదాం" చెప్పాడు నచ్చచెబుతున్నట్టు.

"బావుంది మీ వరస, కుప్ప తగలబెట్టి, పేలాలు ఏరుకుతిన్నట్టు. జాగ్రత్త.. జాగ్రత్త.. అనే మీరే ఇంత ఇదిగా చెప్తున్నారు. నేను కాదంటే మాత్రం అగుతారా?" అంటూ నిట్టూర్చింది.

ఏమంటే.. ఏమంటుందో! అని మౌనంగా ఉండిపోయాడు శేఖరం. తరువాత కొంత అప్పు చేసి ఆ పుస్తకం అచ్చు వేయించాడు.

అయితే ఓ రోజు పొద్దునే కళ్లు నులుముకుని చూశాడు. ఉలిక్కిపడి "అబ్బే ఇది నా భ్రమ అయి ఉంటుంది" అని మరోసారి మళ్లీ మళ్లీ కళ్లు నులుముకుని చూసాడు. ముందు కొంచెం డౌట్‌గా చూసి, ఆ తరువాత తనలో తానే కాస్త నవ్వుకుని, "ఏమాట కామాటే చెప్పుకోవాలి. మా నాన్న నా నుండి దూరమైపోయి వారం రోజులు దాటిపోయింది. కానీ అతని జ్ఞాపకాలు, నా కాలు చుట్టే తిరుగుతున్నట్టు అనిపిస్తోంది" అని మరోసారి తనలో తానే చిన్నగా నవ్వుకుంటూ "లలితా! కాఫీ తాగుతూ మా నాన్న నాకు ఎదురుగా కనిపిస్తున్నా డంటే నమ్ముతావా?" అడిగాడు.



"దివ్యంగా నమ్ముతాను. ఎందుకంటే ఆయన నిజంగానే వచ్చారు మరి" అని ఆమె చెప్పగానే అతను తుళ్లిపడి పక్కనున్న కళ్లజోడు పెట్టుకుని చూసాడు.

"నిజమే.. మా నాన్నే!" అనుకుని "అవునూ! నువ్వు మొన్న వరదల్లో కొట్టుకుపోయావని ఊరంతా అంది నాన్నా. నువ్వు కొట్టుకుపోవడం కళ్లారా చూశామని కొందరు చెప్పారు. పైగా నీకు ఈత కూడా రాదు కదా. నేనూ వెనుకా ముందూ ఆలోచించకుండా వాళ్లు చెప్పిందే నిజమని నమ్మేసాను. వాళ్లు ఎవరిని చూసి ఎవరు అనుకున్నారో ఏమో" అన్నాడు.

"వాళ్లన్నది నిజమేరా. నేను పక్క ఊళ్లో డాక్టర్‌ని కలిసి మనూరికి ట్రాక్టర్‌లో వస్తున్నాను. ఇంతలో పెద్ద వరద ఎదురైంది. నా గుండెల్లో బెదురు మొదలైంది. అలాగే ముందుకు పోనిచ్చాడు ఆ ట్రాక్టర్‌వాడు. అలా కొంచెం ముందుకెళ్లాక వాగు కూడా దాటేస్తా..! అని పెద్ద ఫోజు కొట్టి నడిపాడు. ఒక్కసారిగా వాడి ట్రాక్టర్ కొట్టుకుపోయింది. ఆ వాగులో పడి నేనూ కొట్టుకుపోయాను కానీ పక్క ఊళ్లో ఓ చెట్టుకొమ్మకి చటుక్కున నా చొక్కా తగిలి ఆగిపోయాను. కాసేపటికి ఆ గ్రామంవాళ్లు వచ్చి నన్ను కాపాడి, వరద తగ్గాక వెళ్దురుగానీ అని నన్ను ఆ ఊళ్లోనే వుండమన్నారు. సరేనని ఆ ఊళ్లోనే వున్న నా స్నేహితుడు గిరి ఇంట్లో ఉండిపోయాను. అదీ జరిగింది" అని ఓ క్షణం ఆగి, ఏదో గుర్తొచ్చినట్టు కొంచెం కుర్చీ ముందుకి జరుపుకుని "నా కథల సంపుటి వేయించావట కదా, ఏదీ పత్రా చూద్దాం" అడిగాడు ఆసక్తిగా.


"ఆ.. వేయించాను. ఇంకో నాలుగు రోజులు.. అదే నీ పుట్టిన రోజునాడు విడుదల చేయాలని వేయించాను. ఇలా వేయించమని గిరిగారే చెప్పారు.. అని చెప్పి ఏదో గుర్తుకు వచ్చినట్లు అది సరే నాన్నా. వరద రెండు రోజులకే పూర్తిగా తగ్గిపోయింది. వర్షం కూడా ఆగిపోయింది అంతా మామూలు అయిపోయింది. మరి నువ్వు వారం రోజులు వాళ్లింట్లో ఎందుకు వుండిపోయావు?" అడిగాడు అయోమయంగా.

"అది.. మరీ.. అని కాసేపు కాస్త తటపటాయించాక, నేను చెప్తాను కానీ నువ్వు ఏమీ అనుకోకూడదు".

"సరేలే.. విషయం చెప్పు"

"అక్కడ ఉండగా నాకో ఆలోచన వచ్చింది. వెంటనే గిరిని నీ దగ్గరికి పంపి, నా చివరి కోరిక ఆ కథల సంపుటి వేయిస్తే నా ఆత్మ శాంతిస్తుందని నీతో చెప్పమన్నాను. దాంతో వాడు నీ దగ్గరకి వచ్చి నేను చెప్పమన్నట్టే నీకు చెప్పాడు. సెంటిమెంటుకి పోయిన నువ్వూ సరే అనడంతో నా పథకం పారింది. నేను అప్పుడే వచ్చేద్దాం అనుకున్నాను. కానీ నువ్వసలే కొంచెం పీనాసి మనిషివి. కోడలు గురించి చెప్పనే అక్కర్లేదు. అందుకే, నా కథల సంపుటి ముద్రణ పూర్తయ్యేవరకు నీ దృష్టిలో చనిపోయిన ట్లుగా ఉండిపోతే, నువ్వు ఇక్కడ నాన్న చివరి కోరిక అనే బలమైన సెంటిమెం ట్‌తో కథల సంపుటి వేయిస్తావని ఇలా చేశాను" అని చెప్పడంతో భార్యా భర్తలిద్దరూ తెల్ల మొహాలతో ఒకరిని ఒకరు చిత్రంగా చూసుకున్నారు.

**- గంగాధర్ వడ్లమన్నాటి**


ఈరోజు నీ ఎక్స్‌పైర్ డేట్ అని నెల ముందే మెసేజ్ పంపించాం కదా..! పద...!!
YAMA
మొగుడు పెళ్ళాం దెబ్బలాడుకోడం 'యాక్సిడెంట్' కిందకు రాదు... ఇన్సూరెన్స్ వర్తించదు...!!
పాలమ్ముకో.. పూలమ్ముకో...
చాయిలమ్ముకో...
3/100

ఈ వారం కా'ర్టూ న్స్'







జపాన్‌లోని
ఓసవానో నగర సమీపంలో
వున్న పార్కు ప్రత్యేకమైందని చెప్పవచ్చు.
ఈ పార్కులో బౌద్ధ సన్యాసులు, దేశ విదేశీ
నాయకుల శిల్పాలు ఉండటం విశేషం.
జపాన్‌కు చెందిన ఓ వ్యక్తి తన అభిమాన
నాయకుల కోసం ఈ పార్కును
కట్టించాడట. ఆయన పేరుతోనే దీనిని
'పురేయి సెకిబుత్సనో సతో' అన్న
పేరుతో పిలబడుతోంది.



